www.quicktodaynews.com
RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

QUICK TODAY DAILY
తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను
పత్రిక ప్రారంభించిన అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన క్విక్ టుడే తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణలోని అన్ని జిల్లాలకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన వారికి మాత్రమే ప్రాధాన్యం.
తగిన గౌరవ వేతనం ఇవ్వబడును.
వివరాలకు వెంటనే సంప్రదించగలరు 8886460073 8125972476

EDITOR : GILLALA BUCHI REDDY | మల్కాజిగిరి | సంపుటి : 1 సంచిక : 164 | మంగళవారం, మార్చి 05 2024 | వెల : 3 రూ/.. | పేజీలు - 8



- ఆదిలాబాద్ కేంద్రంగా 6వేల కోట్ల పనులకు శ్రీకారం
- విద్యుత్, రైల్వే ప్రాజెక్ట్ పనులు ప్రారంభించిన ప్రధాని మోడీ
- తెలంగాణకు పెద్దన్నలా సహకరించాలన్న సిఎం రేవంత్ ఆదిలాబాద్ పర్యటనలో ప్రధానికి ఘనంగా స్వాగతం

## తెలంగాణ అభివృద్ధికి
# కట్టుబడి ఉన్నాం

**ఆదిలాబాద్,మార్చి4:** కేంద్రంలోని భాజపా ప్రభుత్వం దేశాభివృద్ధికి కృషి చేస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ఆదిలాబాద్‌లో రూ.7వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులను ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. రామగుండం ఎన్టీపీసీలో 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని జాతికి అంకితం చేశారు. దీంతో పాటు రైల్వే అభివృద్ధి పనులను ప్రారంభించారు. దేశంలోని అనేక రాష్ట్రాలు అభివృద్ధిలో దూసు కెళ్తున్నాయి. తెలంగాణ ఏర్పడి పదేళ్లు అయింది. ఈ రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందని అన్నారు. పేదలు, దళితులు, ఆదివాసీల అభివృద్ధికి కృషి చేస్తుంది. గత పదేళ్లలో పేదరికం నుంచి 25 కోట్ల మంది బయటపడ్డారని మోదీ అన్నారు. ఆదిలాబాద్‌లో వర్చువల్ విధానంలో రూ.6 వేల కోట్ల ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన ఆయన.. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. 'రాష్ట్రాభివృద్ధికి సీఎం రేవంత్‌కు సంపూర్ణంగా సహకరిస్తాం. తెలంగాణలో గడిచిన పదేళ్లలో రూ.56 వేల కోట్లకుపైగా పనులు ప్రారంభించాం. అభివృద్ధిలో కొత్త అధ్యయనాన్ని లిఖించాం అని అన్నారు. అంబారీ - ఆదిలాబాద్ - పింపాలకుట్టీ రైల్వే విద్యుద్దీకరణను జాతికి అంకితం చేశారు. మంచిర్యాల జిల్లా రామగుండంలోని ఎన్టీపీసీ రెండో థర్మల్ పవర్ యూనిట్‌ని ప్రారంభించారు. దేశంలో నేడు జరుగుతున్న అభివృద్ధికి ఆదిలాబాద్ ఓ ఉదాహరణగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. రామగుండం ఎన్టీపీసీ స్టేజ్ వన్ పవర్ ప్లాంట్‌ను జాతికి అంకింత చేసిన ప్రధాన మంత్రి వర్చువల్‌గా పలు శంకుస్థాపనలు చేశారు. ములుగు, బేలాలో రెండు జాతీయ రహదారులకు, ఆరు ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడిన ప్రధాని తెలంగాణ ప్రజల కలల సాకారానికి కేంద్రం ఎప్పుడూ ముందే ఉంటుందని తెలియజేశారు. తెలంగాణ ఏర్పడి పదేళ్లు పూర్తవుతుందని... అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి చెందాలని తాము ఆకాంక్షిస్తున్నట్టు పేర్కొన్నారు.అందుకే హైవేల నుంచి అన్ని విభాగాల్లో సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. అందులో భాగంగా 56 వేల కోట్లు అభివృద్ధి పనులు చేపట్టామని తెలియజేశారు.


## విద్యార్థులను ఉత్తమ పౌరులుగా
# తీర్చి దిద్దం



- సమాజం గౌరవించేలా చేయండి
- గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరం చేయండి
- ఉద్యోగాల కోసం కాదు..సమాజం కోసం పనిచేయండి
- పనిచేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి
- ఎల్బీ స్టేడియంలో టీచర్లకు ఉద్యోగ నియామక పత్రాలు
- భారీ సభలో అందచేసిన సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,మార్చి4:** విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దే క్రమంలో టీచర్లు వారికి మంచి సుగుణాలు అలవడేలా తీర్చిదిద్దాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. గురుకుల టీచర్లుగా నియామకాలు అందుకున్న వారు తమ ఉద్యోగం కోసం అని కాకుండా సామాజిక బాధ్యతగా పౌరులను తీర్చిదిద్దే పని చేపట్టాలన్నారు. తెలంగాణ తులసివనంలో ఒక్క గంజాయివనం కూడా ఉండరాదని కఠినంగా నిర్ణయించామని, విద్యార్థులు గంజాయి మత్తులకు అలవాటు పడకుండా వారిని సక్రమ మార్గంలో పెట్టే బాధ్యత టీచర్లదేనని అన్నారు. మీ చేతుల్లోనే వారి భవిష్యత్ ఆధారపడి వుందన్నారు. ప్రభుత్వ పాఠశాల లోనే చదివి తాను ఈ స్థాయికి ఎదిగానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఎల్బీ స్టేడియంలో లెక్చరర్లు, టీచర్లు ఉద్యోగాలకు ఎంపికైన 5,192 మందికి నియామక పత్రాలను ఆయన అందజేశారు. మూడు నెలల్లోనే 30 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చామని పేర్కొన్నారు. ఎల్బీ స్టేడియం లోనే రైతును రాజుగా చేసే పాలనకు నాంది పడిందని చెప్పారు. తెలంగాణ సాధనలో నిరుద్యోగులు, యువత పాత్ర ఎంతో గొప్పది. వారి త్యాగాలు, బలిదానాలతోనే స్వరాష్ట్రం సాకారమైంది. ప్రత్యేక తెలంగాణ ఏర్పడితే న్యాయం జరుగుతుందని భావించారు. కానీ, కుటుంబ పాలనలో యువత ఆకాంక్షలు నెరవేరలేదు. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యుల పదవులు ఊడగొడితేనే.. తమకు ఉద్యోగాలు వస్తాయని యువత భావించారు. అనుకున్నట్టే చేయడంతో.. ఇప్పుడు ఉద్యోగాలు వస్తున్నాయని అన్నారు. ఈ ప్రభుత్వం ప్రజాప్రభుత్వంమని నిరూపించామని, ఇకముందు మరింతగా వెళ్లేందుకు తమకు ఆశీర్వదిం చాలని అన్నారు. నాకు ఇంగ్లిష్ రాదని కొందరు అవహేళన చేస్తున్నారు. నేను జిల్లా పరిషత్ పాఠశాలలో తెలుగు మీడియంలో చదివా. గుంటూరు, గుడివాడకు వెళ్లి కార్పొరేట్ పాఠశాలల్లో చదవలేదు. వేలాది గురుకులాలు నిర్మించామని గత పాలకులు గొప్పగా చెబుతున్నారు. ఎక్కడా వాటికి శాశ్వత భవనాలు నిర్మించలేదు. వసతులు లేని అ÷-దదె భవనాల్లో పేద విద్యార్థులు అవస్థలు పడ్డారు. రేషనైలేజేషన్ పేరిట కేసీఆర్ 6 వేల పాఠశాలలను మూసివేశారు. కులవృతుల వారి పిల్లలు ఆ పనులే చేసుకోవాలని భావించారు. పేదలు గొర్రెలు, బర్రెలు, చేపలు మాత్రమే పెంచాలనట్టుగా వ్యవహరించారు.

## నాలుగు స్థానాలకు
# బిఆర్ఎస్ అభ్యర్థుల ప్రకటన

**హైదరాబాద్,మార్చి4:** త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల కోసం బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు అభ్యర్థులను ప్రకటించారు. తొలి జాబితాలో నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేశారు. కరీంనగర్‌కు మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, పెద్దపల్లికి మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్, ఖమ్మంకు ప్రస్తుత నామా నాగేశ్వరరావు, మహబూబూబాద్ స్థానానికి ఎంపి మాలోత్ కవిత పేర్లను ప్రకటించారు. ఆది, సోమవారాల్లో నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాలకు చెందిన నేతలతో బీఆర్ఎస్ అధినేత వరుస సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లోక్‌సభ ఎన్నికలపై నేతలతో చర్చించి.. అభ్యర్థుల ఎంపికపై అభిప్రాయాలను సేకరించారు. ఈ క్రమంలో ముఖ్యనేతల అభిప్రాయం మేరకు.. సమష్టి నిర్ణయంతో తొలి విడుదతలో నలుగురు అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలువబోతున్న అభ్యర్థులకు కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. తొలుత మానుకోటకు సంబంధించి పలు పేర్లను పరిశీలించారు. చివరకు కవిత పేరునే ఖరారు చేశారు. ఈ సమావేశంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, హరీశ్‌రావు, ఎంపీలు కేశవరావు, నామా నాగేశ్వరరావు, కవిత పాల్గొన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు సమావేశానికి హాజరు కాకపోవడం చర్చనీయాంశమైంది. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో రెండు రోజులుగా ఆయా పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ముఖ్యనేతలతో కేసీఆర్ కీలక అంశాలపై చర్చించారు. అభ్యర్థులను ప్రకటించిన అనంతరం కేసీఆర్ మీడియాతో మాట్లాడారు. కరీంనగర్ తర్వాత ఖమ్మంలో కూడా సభ పెడతాం. త్వరలోనే ఖమ్మంలో భారీ బహిరంగ సభ ఉంటుంది. జిల్లాలో పార్టీ ఓడిపోయిందని ఎవరూ అధైర్యపడొద్దు. పార్టీ వీడి వెళ్లే నేతలతో బీఆర్ఎస్‌కు ఎలాంటి నష్టం లేదు. రాబోయే కాలం మనదే. నేతలు కలిసికట్టుగా పనిచేసి ఎంపీ అభ్యర్థులను గెలిపించుకోవాలి. ఒక్కో నియోజకవర్గానికి ముగ్గురు సమన్వయకర్తలను నియమిస్తాం. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ లాంటి నేతకు రాజకీయాల్లో ఒడిదుడుకులు తప్పలేదు. మనమెంత మనకూ గెలుపు, ఓటమిలు వస్తాయి. కాంగ్రెస్ పార్టీపై అప్పుడే ప్రజల్లో వ్యతిరేకత మొదలయింది. కాంగ్రెస్ వ్యతిరేకతను మనం సద్వినియోగం చేసుకోవాలి. కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలనపై అవగాహన రావడం లేదని కేసీఆర్ పేర్కొన్నారు.

## చట్టసభ సభ్యుల అవినీతిపై సుప్రీం తీర్పు

### వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుందన్న మోడీ

**న్యూఢిల్లీ,మార్చి4:** చట్టసభ సభ్యుల అవినీతిపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును దేశ ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్‌ఖాతాలో స్పందించారు. 'గౌరవ సుప్రీం కోర్టు అద్భుతమైన తీర్పును ఇచ్చింది. అది భవిష్యత్తులో స్వచ్ఛమైన రాజకీయాలకు కారణమై.. వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతుంది' అని అభిప్రాయపడ్డారు. ఈ పోస్టుకు సుప్రీం తీర్పునకు సంబంధించిన కథనాన్ని జత చేశారు.

## దేశ ముఖచిత్రాన్ని మార్చిన
# ప్రధాని మోడీ

### ఆదిలాబాద్ సభలో కిషన్ రెడ్డి

**ఆదిలాబాద్,మార్చి4:** ఆదిలాబాద్‌లో బీజేపీ నిర్వహించిన సభలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. పదేళ్లలో దేశ ముఖచిత్రాన్ని ప్రధాని మోదీ మార్చేశారిన అన్నారు. అభివృద్ధిక ఇదేశాన్ని నమూనాగా నిలిపారని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ నుంచి బీజేపీకి 17 సీట్లు రావాలి. కేసీఆర్ పార్టీ నిన్నటి పార్టీ. ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేసే పరిస్థితి లేదు. కుటుంబ, అవినీతి పాలనను కేసీఆర్ తెలంగాణ ప్రజలపై రుద్దారని మండిపడ్డారు. ఆర్థిక వ్యవస్థ బలపడితే దేశంపై విశ్వాసం పెరుగుతుంది. పేదలు, దళితుల అభివృద్ధికి కేంద్రం అనేక చర్యలు చేపట్టింది. వచ్చే పదేళ్లలో భారత్ అభివృద్ధిపరంగా మరింత ముందుకెళ్తుంది.

## మజ్లిస్ కంచుకోటను
# బద్ధలు కొట్టేనా?

- పాతబస్తీలో ఎంఐఎంకు గట్టిపోటీ
- తెరపైకి హాట్ టాపిక్ గా మాధవీలత
- ముస్లిం మహిళల ఓట్లను గండికొట్టేందుకు బీజేపీ పావులు
- ట్రిపుల్ తలాఖ్ పై ముస్లిం మహిళా సంఘాలతో కలిసి కృషి
- 40 ఏండ్ల చరిత్రను తిరగరాసేందుకు పక్కా ప్లాన్
- ఒవైసీల అడ్డాలో బీజేపీ పాగా వేయాలని యత్నం



వివరాలు 2లో



## ఎల్ఆర్ఎస్ ఉచితంగా
# అమలు చేయాలి

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్

**హైదరాబాద్,మార్చి4:** ఎల్ఆర్ఎస్‌పై తెలంగాణ సర్కార్ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ పోరుబాటకు దిగింది. 6న అన్ని నియోజకవర్గాల్లో, హైదరాబాద్‌లో జీహెచ్‌ఎంసీ, హెచ్ఎండీఏ కార్యాలయాల వద్ద రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలకు పిలుపునిచ్చింది. 7న జిల్లా కలెక్టర్, ఆర్డీవోలను కలిసి వినతి పత్రాలు సమర్పించాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలపై ఆర్థిక భారం మోపడానికి కాంగ్రెస్ ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందన్నారు. తాము తెచ్చిన పథకాలకు ఆనాడు అడ్డు చెప్పి ఇప్పుడు అవే పనులు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందన్నారు. ఎల్ఆర్ఎస్‌పై కాంగ్రెస్ నేతలు నాలుక మడతేశారని విమర్శించారు. తాము ఎల్ఆర్ఎస్ తెస్తే కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆనాడు కోర్ట్‌లో కేసు వేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తామని భట్టి విక్రమార్క అన్నారని.. ఉచితంగా భూములు క్రమబద్ధీకరిస్తామని ఉత్తమ్ చెప్పారన్నారు. దోచుకోవడానికి ఎల్ఆర్ఎస్ తెచ్చారని సీతక్క కూడా అన్నారని తెలిపారు. ప్రజల నుంచి 20వేల కోట్లు భారం ప్రజలపై వేయడానికి ఎత్తుగడ వేశారని మండిపడ్డారు.

# మజ్లిస్ కంచుకోటను బద్ధలుకొట్టేనా?

**-పాతబస్తీలో ఎంఐఎంకు గట్టిపోటీ**

**-తెరపైకి హాట్ టాపిక్ గా మాధవీలత**

**-ముస్లిం మహిళల ఓట్లను గండికొట్టేందుకు బీజేపీ పావులు**

**-ట్రిపుల్ తలాఖ్ పై ముస్లిం మహిళా సంఘాలతో కలిసి కృషి**

**-40 ఏండ్ల చరిత్రను తిరగరాసేందుకు పక్కా ప్లాన్**

**-ఒవైసీల అడ్డాలో బీజేపీ పాగా వేయాలని యత్నం**



**హైదరాబాద్, క్విక్ టుడే :** తెలంగాణ బీజేపీ అభ్యర్థుల జాబితా విడుదల తరువాత ఓ పేరు మాత్రం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ అవుతోంది. హైదరాబాద్ లోక్‌సభ స్థానంపై ఫోకస్ చేస్తోన్న బీజేపీ.. అక్కడి నుంచి ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీపై ఓ మహిళను బరిలో నిలుపుతున్నారు. డాక్టర్ మాధవి లత ను హైదరాబాద్ లోక్ సభ స్థానం నుంచి పోటీ చేయించి, ఎంఐఎం కంచుకోటను బద్ధలుకొట్టాలని బీజేపీ పెద్దలు భావిస్తున్నారు. ఓ అగ్రనేతను కాకుండా మహిళా నేత మాధవి లతకు హైదరాబాద్ స్థానం నుంచి ఛాన్స్ ఇవ్వడంతో ఎవరీమే అని చర్చ జరుగుతోంది. కొంపెల్ల మాధవీ లత కోఠిలోని మహిళా కళాశాల లో రాజనీతి శాస్త్రంలో ఎంఏ చదివారు. డాక్టర్ కొంపెల్ల మాధవీ లత విరించి హాస్పిటల్స్ చైర్‌పర్సన్ గా సేవలు అందిస్తున్నారు. ఆమె ఒక ప్రొఫెషనల్ భరతనాట్యం డాన్సర్. తన పిల్లలకు హోమ్‌స్కూల్‌కు ఎంచుకున్నట్లు ఆమె చెబుతుండేవారు. ఆమె లోపాముద్ర ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు. దాంతోపాటు మాధవీ లత లతామా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలుగా ప్రసిద్ధి. హైదరాబాద్‌లోని తన లోపాముద్ర ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా నగరంలోని పలు ప్రాంతాల్లో పలు ఆరోగ్య సంరక్షణ, విద్య, ఆహార పంపిణీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తుంటారు. ముఖ్యంగా హింధూ ధర్మం, హిందూ సాంప్రదాయాలపై ఆమె మాట్లాడే మాటలు, ఇచ్చే ప్రసంగాలో ఎందరినో ఆకట్టుకున్నాయి. హైందవ సంస్కృతి, సాంప్రదాయాలపై ఆమె చేసే వ్యాఖ్యలు తరచుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతుంటాయి. ఎన్‌సీసీ క్యాడెట్‌గా, క్లాసికల్ మ్యూజికల్ సింగర్‌గా సైతం మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఎంఐఎం కంచుకోట పాతబస్తీలో తరుచూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టేవారు. ప్రధాని మోదీ నాయకత్వం, బీజేపీ విధానాలకు ఆకర్షితురాలై మాధవీ లత బీజేపీలో చేరారు. పాతబస్తీలో ఏమైనా సమస్యలు వస్తే, వాటికి పరిష్కారం చూపించేవారు. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యలకు ఆమె కౌంటర్ ఇచ్చేవారు. బీజేపీ ప్రతినిధిగా అసదుద్దీన్ విధానాలను తనదైన శైలిలో వ్యతిరేకించడంతో పార్టీ అధిష్టానం దృష్టిలో పడ్డారు. గతంలో హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి బరిలోకి దిగిన బీజేపీ నేతలు రెండో స్థానంలో నిలిచారు కానీ విజయాన్ని మాత్రం అందుకోలేకపోయారు. తెలంగాణలో ఎంఐఎం గెలిచే ఒక్క ఎంపీ స్థానం హైదరాబాద్. ప్రస్తుత ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ 2004 నుంచి వరుస ఎన్నికల్లో విజయం సాధిస్తున్నారు. 2009, 2014, 2019 నాలుగు వరుస లోక్ సభ ఎన్నికల్లో నెగ్గుతూ వస్తున్నారు. అసదుద్దీన్ కు ముందు ఆయన తండ్రి సలావుద్దీన్ ఒవైసీ 1984 నుంచి 2004 వరకు రెండు దశాబ్దాలపాటు పలుమార్లు ఎంపీగా గెలుపొందారు. అంటే హైదరాబాద్ సీటు 1984 నుంచి నాలుగు దశాబ్దాలుగా ఒవైసీల అడ్డా. ఈసారి ఎలాగైనా ఎంఐఎంకు చెక్ పెట్టి, విజయం సాధించాలని భావిస్తున్న బీజేపీ అధిష్టానం అనూహ్యంగా మాధవీ లతకు ఛాన్స్ ఇచ్చింది. ఎంతో ఆస్తి ఉన్నా సాధారణ జీవితమే తనకు ఇష్టమని చెప్పే మాధవీ లత ఆధ్యాత్మిక విషయాలు, సంస్కృతి, సాంప్రదాయాలపై తన అభిప్రాయాల్ని నిర్మోహమాటంగా చెబుతుంటారు. అసదుద్దీన్ పైనే పోటీకి నిలపడంతో మాధవీ లత మరోసారి హాట్ టాపిక్ అయ్యారు.

ఎన్‌సీసీ క్యాడెట్‌గా, క్లాసికల్ సింగర్‌గా మాధవీలత గుర్తింపు తెచ్చుకున్నారు. బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన మాధవీలత రెండేళ్లుగా పాతబస్తీ వేదికగా అనేక ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటున్నారు. గోశాలతో పాటు భారీ యజ్ఞశాల ఏర్పాటు చేసి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగాలు, పాలనా స్ఫూర్తితో బీజేపీలో చేరారు. కొంతకాలంగా పాతబస్తీ ప్రజలతో మమేకమై పేదలను ఆదుకుంటున్నారు. సామాజిక కార్యకర్తగా ట్రిపుల్ తలాక్‌పై అనేక ముస్లిం మహిళా సంఘాలతో కలిసి పనిచేశారు. ఎంపీ అసదుద్దీన్ ఓవైసీపై కౌంటర్‌గా ఇచ్చిన పలు ఇంటర్వ్యూలతో ఆమె పాపులర్ అయ్యారు. బీజేపీ ప్రతినిధిగా అసదుద్దీన్ విధానాలను తనదైన శైలిలో వ్యతిరేకించడంతో పార్టీ అధిష్ఠానం దృష్టిలో పడ్డారు.

**25 ఏళ్లు సంతోష్‌నగర్‌లోనే..**

మాధవీలత పాతబస్తీలోని ఓల్డ్ సంతోష్‌నగర్‌లో జన్మించారు. విద్యాదాయిని పాఠశాలలో ప్రాథమిక విద్యనభ్యసించారు. నిజాం కాలేజీలో డిగ్రీ, కోఠి ఉమెన్స్ కాలేజీలో పొలిటికల్ సైన్స్‌లో పీజీ పూర్తి చేశారు. ఆమె పుట్టి పెరిగిందంతా ఓల్డ్ సంతోష్‌నగర్‌లోనే. 25 సంవత్సరాల పాటు అక్కడే ఉన్నారు. వివాహం అనంతరం భర్త కె.విశ్వనాథ్ (విరించి గ్రూప్ ఫౌండర్)తో కలిసి జూబ్లీహిల్స్‌కు వెళ్లిపోయారు. వీరికి ముగ్గురు పిల్లలు. ప్రస్తుతం బంజారాహిల్స్‌లోని విరించి ఆస్పత్రి చైర్‌పర్సన్ గా, లతా ఫౌండేషన్ నిర్వాహకురాలిగా వ్యవహరిస్తున్నారు. కాగా మాధవీలత ఎంపికపై పునరాలోచించాలని హైదరాబాద్ స్థానం కోసం ప్రయత్నాలు చేసిన బీజేపీ భాగ్యనగర్ జిల్లా నాయకులు అధిష్ఠానాన్ని కోరుతున్నారు.

# భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

**-కీసర రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్**





**మేడ్చల్ కలెక్టరేట్, క్విక్ టుడే :** కీసర రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు అధికారులందరూ సమన్వయంతో పని చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కీసర రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 6 వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో సోమవారం కీసర గుట్టకు వెళ్ళిన కలెక్టర్ గౌతమ్, జిల్లా పరిషత్ చైర్మన్ శరత్ చంద్ర రెడ్డి, డిసిపి పద్మజ, ఎంఎల్ ఏ మల్లారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్లు అభిషేక్ అగస్త్య, విజయేందర్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ తటాకం నాగలింగం శర్మ, ఆలయ ఈవో నరేందర్ లతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు పూర్ణ కుంభంతో కలెక్టర్ కు స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గల సమావేశ మందిరంలో కలెక్టర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉండేందుకు క్యూలైన్ లను పెంచాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున ఆర్టీసీ బస్సులు పెంచాలన్నారు. భద్రతా లోపం తలెత్తకుండా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు నిర్వహించాలన్నారు. భక్తులకు అత్యవసర చికిత్సకై అవసరమైన వైద్య సిబ్బంది, మందులు అందుబాటులో ఉండాలన్నారు. బ్యారికేడ్, దర్శనం క్యూ లైన్, పార్కింగ్కు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, ప్రస్తుతం ఎండలు పెరుగుతున్నాయని అందుకు జాతరలో భక్తులకు అందుబాటులో అవసరమైన అన్ని చోట్ల త్రాగునీటిని అందుబాటులో ఉంచాలని వాటర్ వర్క్స్ వారికీ తెలిపారు. జాతరలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చూడాలని అందుకు సంబంధించి ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయాలని ఈ విషయంలో జిల్లా పంచాయతీ అధికారులు అవసరమైన ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సిందిగా కలెక్టర్ తెలిపారు.



కీసర గుట్ట బ్రహ్మోత్సవాల జాతరలో పూజ సామాగ్రి , ఆహార పదార్థాల నుంచి మొదలుకొని అన్ని రకాల వస్తువుల విక్రయానికి సంబంధించి ధరలు భక్తులకు అందుబాటులో ఉండేలా చూడాలని, ఎక్కువ ధరలకు విక్రయించకుండా అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత శాఖ అధికారులు వ్యాపారులకు తెలపాలన్నారు. జాతర రోజుల్లో ఆలయ పరిసరాల్లో అగ్నిమాపక సిబ్బందితో పాటు ఫైరింజన్ను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కీసర ఆలయంకు సంబంధించి ఏమైనా ఇబ్బందులు, సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని ఆలయ ఈవో, చైర్మన్ కు తెలిపారు. మహాశివరాత్రికి కీసరగుట్టలో రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి విజయవంతం చేయాలని కలెక్టర్ సమావేశంలో స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో కీసర ఆర్డీవో ఉపేందర్ రెడ్డి, జెట్ పీటీసీలు , ఆలయ కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ -- మల్కాజిగిరి జిల్లా ప్రజావాణి కార్యక్రమానికి 98 ఆర్జీలు



**మేడ్చల్ కలెక్టరేట్, క్విక్ టుడే :** సోమవారం కలెక్టరేట్ కార్యాలయము లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 98 అర్జీలను లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి డిఆర్ఓ హరిప్రియ స్వీకరించారు. అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ దరఖాస్తులను పెండింగ్ లో పెట్టకుండా వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిఆర్ఓ సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బొమ్మలరామారంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం





**యాదాద్రి భువనగిరి, క్విక్ టుడే :** బొమ్మలరామారం మండలంలోని పిల్లిగుండ్ల తండా, కాండ్లకుంట తండా, గోవింద్ తాండ, లక్ష్మి తండ, వాలు తండా, కోమటికుంట తండా, యావపూర్ తండా, రంగాపురం గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం నిధుల ధ్వారా మంజూరైన సీసీ రోడ్డులను ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రారంభించారు.

## మల్లన్న స్వామిని దర్శించుకున్న ప్రభుత్వ విప్

### ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**యాదాద్రి భువనగిరి :** తుర్కపల్లి మండలం ముల్కలపల్లి శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి బ్రహ్మోత్సవాలలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన బీర్ల ఐలయ్యని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువకులు, ప్రజలు, ఘనస్వాగతం పలికారు. ముల్కలపల్లి గ్రామ చౌరస్తా నుండి మల్లన్న స్వామి వారి ఆలయం వరకు స్వాగత ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మరుగుజ్జుల పోతారాజులు, ఇతర వేషధారణలు అందరిని అలరించాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే గా గెలిచిన తర్వాత మొదటిసారి మల్లికార్జున స్వామి వారి బ్రహ్మోత్సవాలకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు, ఘన స్వాగతం పలికిన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు, ప్రజలకు, ధన్యవాదాలు తెలిపారు. మల్లన్న స్వామిని దర్శించుకోని తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఆలేరు నియోజకవర్గం ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ ప్రభుత్వం బ్రహ్మోత్సవాలకు, ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

### బాలాజీ లేఅవుట్ క్రికెట్ ప్రీమియం లీగ్ సీజన్ వన్ లో ట్రోఫీలను బహూకరించిన ఎస్ పి ఆర్ గ్లోబల్ స్కూల్ చైర్మన్ సొంటిరెడ్డి పున్నారెడ్డి

**(కుత్బుల్లాపూర్ )** కుత్బుల్లాపూర్ విద్యార్థులకు విద్యాబుద్ధులతో పాటు ఆటపాటలు కూడా ఎం తో ముఖ్యమని విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని నింపుతూ క్రీడలను ప్రోత్సహిస్తున్న ఎస్ పి ఆర్ గ్లోబల్ స్కూల్ చైర్మన్ సొంటిరెడ్డి పున్నారెడ్డి ఇంత పెద్ద ఈవెంట్ ని ప్రోత్సహించిన బాలాజీ లేఅవుట్ సభ్యులకి ముఖ్యంగా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లిన కృష్ణ కి అభినందనలు తెలియజేసిన పున్నా రెడ్డి పున్నా రెడ్డి మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలో ఇలాంటి క్రికెట్ లీగ్స్ ని ప్రారంభించి ఆటలు ప్రోత్సహించాలని చెప్పి తెలియజేయడం జరిగింది..

### కండ్లకోయ ఐటీ పార్క్ శంకుస్థాపన వేదిక పరిశీలన కార్యక్రమంలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి

**(కుత్బుల్లాపూర్ )** మేడ్చల్ ఈనెల 9వ తేదీన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా మల్కా జిగిరి పార్లమెంట్ నియోజక వర్గం,మేడ్చల్ నియోజ కవర్గంలోని కండ్లకోయలో బహుళ ప్రయోజనాలతో ఐటీ పార్కు శంఖుస్థాపన వేదిక ఏర్పాట్లను పరిశీలించిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి మరియు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి... ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నర్సారెడ్డి భూపతి రెడ్డి, పున్నారెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి మరియు జిల్లా నాయకులు పాల్గొన్నారు..

జన్మదిన, వివాహ పదవీ విరమణ శుభాకాంక్షలు

ఉద్యోగం, వ్యాపారం రియల్ ఎస్టేట్ బహిరంగ ప్రకటనలు

జయంతి, వర్ధంతి శ్రద్ధాంజలి, నిర్యాణము

అన్ని రకాల ప్రకటనల కోసం సంప్రదించండి

88864 60073

81259 72476

# వడ్డీ లేని రుణాలు ఇవ్వాలి

## - జిల్లా కలెక్టర్ హరి చందనకు పొదుపు సంఘాల మహిళల వినతి

**నల్లగొండ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 4 (క్విక్ టుడే) :**



పొదుపు సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని ప్రతి మహిళకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు ఈరోజు ఐద్వా ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ హరిచందనా దాసరి గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ ఇటీవల నల్లగొండ జిల్లా వ్యాప్తంగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో సమగ్ర సర్వే నిర్వహించడం జరిగిందని ఈ సర్వే ఆధారంగా మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. నేటికీ పావలా వడ్డీ రుణాలు అందడం లేదని, బ్యాంక్ లు అధిక వడ్డీ లు వసూలు చేస్తున్నారని, సంఘం గ్రూపు లోనుకు బ్యాంకులకు వెళ్ళగా లక్ష కు పైగా బలవంతంగా డిపాజిట్లు పెట్టుకుంటున్నారని తెలిపారు. దీనిపై న బ్యాంక్ లు వడ్డీ ఇవ్వడం లేదు. ఇది ఎక్కడా లేని విధంగా నల్గొండ జిల్లాలో బ్యాంకర్స్ అమలు చేస్తున్నాయని అన్నారు. మహిళలకు ప్రత్యేకంగా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలిని మహిళా పొదుపు సంఘం సభ్యురాలు మరణిస్తే లోను మాఫీ చేయాలని మహిళా సభ్యురాలు పిల్లలకు స్కాలర్షిప్స్ ఇవ్వాలని అభయ హస్తం డబ్బులు జిల్లాలో ఇంకా పెండింగ్ లో ఉన్నవి 2018 నవంబర్ వరకు ఇచ్చారు అందులో %౦ఎ ర% సంఘాలకు 2021 వరకు ఇచ్చారు. అసెంబ్లీలో రద్దు చేస్తూ చట్టం కూడా అయినప్పటికీ నేటికీ విడుదల చేయలేదని వెంటనే ఇవ్వాలన్నారు. స్త్రీ నిధి డబ్బులు జిల్లాలో సక్రమంగా అమలు కావడం లేదు దుర్వినియోగం అవుతున్న ఆరోపణలు ఉన్న యాని గ్రామాలలో 50,60 సంఘాలకు ఒక సంఘ బంధం కమిటీలు ఉన్నవి. నిబంధన ప్రకారంగా 35 సంఘాలకు ఒక సంఘం ఉండేవిధంగా చూడాలని అన్నారు . ప్రతి సంవత్సరం సంఘ బంధం నూతన కమిటీల ఎన్నిక జరగాలని కానీ జరగడం లేదని అన్నారు. సంఘ బంధం గ్రామ కమిటీలకు భవనాలను నిర్మించి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలేబోయిన వరలక్ష్మి రాష్ట్ర కమిటీ సభ్యులు కొండ అనురాధ జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మ జిల్లా సహాయ కార్యదర్శులు చనగాని నాగమణి భూతం అరుణకుమారి పాదూరి గోవర్ధన కారంపొడి ధనలక్ష్మి పాల్గొన్నారు.

## మంత్రులు క్షేత్రస్థాయిలో

# కరువు పరిశీలన చేయాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి
- కేశవరాజు పల్లి లో ఎండిన పంట పొలాల పరిశీలన



**నల్లగొండ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 4 (క్విక్ టుడే) :**

భూగర్భ జలాలు అడుగంటి బోర్లు ఎండిపోయి చేతికొచ్చేముందు ఎండుతున్న పంటను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పంట నష్టపరిహారాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి పంపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి కోరారు. సోమవారం సిపిఎం నల్గొండ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో 4వ వార్డు కేశరాజు పల్లి లో నీరు లేక ఎండిన వరి పొలాలను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ కరువు కారణంగా రైతు ఎకరానికి 25 వేల రూపాయల పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వేసిన పంట ఎండిపోయి గేదలు మేపుకోవడానికి వదిలివేయాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటనలు నిర్వహించి ఎండిపోయిన పంటలను జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి పంపాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం మంత్రులు రైతులను ఆదుకోవడానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు త్రాగునీటి కోసం నీటిని కాలువల ద్వారా చెరువులు నింపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హాశం, పట్టణ కార్యదర్శి ఎండి సలీం, జిల్లా కమిటీ సభ్యులు వీరపల్లి వెంకటేశ్వర్లు, దండెంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, పట్టణ నాయకులు కుంభం కృష్ణారెడ్డి, అద్దంకి నరసింహ, పిన్నపురెడ్డి మధుసూదన్ రెడ్డి, భూతం అరుణ, కేశవరాజుపల్లి మాజీ సర్పంచ్ పొనుగోటి జనార్దన్ రావు ,స్థానిక రైతులు ముత్తినేని పరుశరామ్, ముత్తినేని మురళి, చింతల దుర్గయ్య, చింతల రామస్వామి, చింతల మధు, వెంకన్న పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## మంచి మనసుని చాటుకున్న

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

### బీజేపీ లీడర్ సెల్ నాయకుడు పిట్ట శ్రీనివాస్ రెడ్డి




**ఉప్పల్, క్విక్ టుడే :** గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోడి ని రాష్ట్ర ముఖ్య మంత్రి సాదరంగా ఆహ్వానించి గౌరవ మర్యాదలతో ఘన స్వాగతం పలికి విధి నిర్వహణలో భాగంగా విజ్ఞత హుందాతనం తో మంచి మనసుని చాటుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని బీజేపీ లీగల్ సెల్ నాయకులు హైకోర్టు సుప్రీంకోర్టు న్యాయవాది పిట్టా శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత పాలకులు గౌరవ ప్రధాన మంత్రి తెలంగాణ రాష్ట్ర ము లో పర్యటనకు వచ్చిన కనీస ప్రోటో కాల్ పాటించలేదనీ, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నీ కలవలేదనీ, రాష్ట్రానికి నిధులు మంజూరు చేయాలని గానీ పెండింగ్ పనులకు అనుమతి తీసుకుని రాష్ట్ర అభివృద్ధికి సహాయ సహకారం కావాలని గానీ ప్రధాని మోడీ నీ ఎన్నడూ అడగ లేదనీ, అహంకార, గర్వం తో గవర్నర్ ని కూడా అవమానించారనీ, గత ప్రభుత్వం నియంత పాలన ప్రజలు గమనించి గత అసెంబ్లీ ఎన్నికల లో ఓటమి పాలు చేసి అధికారం నుండి దూరం చేశారన్నారు. ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం తో స్నేహ సంబంధాలు కలిగి కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారం అందిస్తూ నిధులు మంజూరు చేయించి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని ప్రజలు ముక్త కంఠంతో కోరు తున్నారనీ అని పిట్టా శ్రీనివాసరెడ్డి తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి కోరిక మేరకు కేంద్ర ప్రభుత్వం 175 ఎకరాల కేంద్ర ప్రభుత్వ భూమి ను రాష్ట్ర అభివృద్ధి కోసం కేటాయించడం గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలంగాణ అభివృద్ధి ప్రదాతగా వేలాది కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసి అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న గొప్ప వారిగా పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్నారని పిట్టా శ్రీనివాసరెడ్డి హర్షం ఆనందం వ్యక్తం చేశారు.

## ఓడిపోయేందుకు

# జగన్ సిద్ధం

**జనసేన-టిడిపిలతో వైసిపి షేక్**
**రాష్ట్రంలో అరాచక పాలనకు చరమగీతం**
**రాష్ట్రప్రయోజనాల కోసమే జనసేనతో పొత్తు**
**ఒక్క ఛాన్స్ అంటూ రాష్ట్రాన్ని దోచేసారు**
**ఎదిరించిన వారిని అడ్డంగా నరికేశారు**
**40 ఏళ్ల రాజకీయంలో ఇంత అరాచకం చూడలేదు**
**టిడిపిలో చేరిన వేమిరెడ్డిం దంపతులు**
**చేరిక సభలో టిడిపి అధినేత చంద్రబాబు విమర్శలు**



**నెల్లూరు:** రాష్ట్రంలో జగన్ అరాచక పాలన అంతమొందించేందుకు మనమంతా ఒక్కటి కావాల్సి ఉందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రప్రయోజనాల కోసమే జనసేనతో కలసి పొత్తులు పెట్టుకున్నామని, దీనిని కూడా వైసిపి జీర్ణించుకోవడం లేదన్నరు. ఒక్క ఛాన్స్ అంటూ వచ్చి ఎపిని జగన్ దోచుకున్నారని మండిపడ్డారు. నెల్లూరు జిల్లాలో వైకాపా కీలక నేత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి ప్రశాంతి రెడ్డి తెదేపాలో చేరారు. తెదేపా అధినేత చంద్రబాబు సమక్షంలో వారిద్దరూ పసుపు కండువా కప్పుకొన్నారు. ఇటీవల వైకాపాకు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ప్రభాకర్‌రెడ్డితో పాటు నెల్లూరుకు చెందిన పలువురు కార్పొరేటర్లు, సర్పంచులు తెదేపాలో చేరారు. నెల్లూరు పీవీఆర్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి భారీగా తెదేపా–జనసేన కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి చంద్రబాబు మాట్లాడారు. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అజాత శత్రువు. ఆయన.. ప్రజా సేవకు మారుపేరు. యుద్ధానికి సై అంటూ అంతా ముందుకొస్తున్నారు. వేమిరెడ్డి రాకతో సునాయాసంగా గెలవబోతున్నాం. ప్రజలకు సేవ చేసే ఏకైక ఉద్దేశంతోనే వేమిరెడ్డి పార్టీలోకి వచ్చారు. నెల్లూరు కార్పొరేషన్ మొత్తం ఖాళీ అయింది. పార్టీలోకి వస్తున్న ప్రతి ఒక్కరికీ మనస్ఫూర్తిగా స్వాగతం పలుకుతున్నా. రాజకీయాలకు గౌరవం తెచ్చే వ్యక్తులను పార్టీలోకి స్వాగతిస్తున్నా. ప్రశ్నించిన వారిని వేధించడమే సీఎం జగన్ పనిగా పెట్టుకున్నారు. మనమంతా బానిసలం.. ఆయన రారాజు.. అనుకుంటున్నారు. ఎవరైనా ఆయన్ను వ్యతిరేకించినా.. చేసింది తప్పని చెప్పినా.. ఇక వారి పని అయిపోయినట్లే. అలా ప్రశ్నించినందుకే సొంత పార్టీ నేతలకు సైతం వేధింపులు తప్పలేదు. సీఎం జగన్ అవలంబిస్తోన్న తీరును చూస్తే చాలా బాధేస్తోంది. వ్యక్తులు, ప్రజాస్వామ్యానికి గౌరవం ఇచ్చే పార్టీ తెదేపా. అహంకారంతో ఇష్టానుసారం రాష్ట్రాన్ని నాశనం చేసిన వ్యక్తిని ఇంటికి పంపించాల్సిన సమయం వచ్చింది. ఆ బాధ్యత మన అందరిపైనా ఉంది. ఇది ఏ ఒక్కరి కోసమో కాదు. ఐదు కోట్ల ప్రజానీకం, భావితరాల భవిష్యత్తు కోసం జగన్‌ను గద్దె దించాలి. రాష్ట్రం, ప్రజలపై ఎలాంటి గౌరవం లేని వ్యక్తి సీఎంగా ఉండేందుకే ఏమాత్రం అర్హత లేదు. ఆయన విధానాలు నచ్చక వాళ్ల నేతలే పార్టీకి బైబై అంటున్నారు. కార్యకర్తలు తిరుగుబాటు చేసే పరిస్థితికి వచ్చారు. ఈ ముఖ్యమంత్రికి భంగపాటు తప్పదు. వెయ్యి శాతం చెబుతున్నా.. రాష్ట్రంలో రాబోయేది తెదేపా–జనసేన ప్రభుత్వమే' అని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

ఇది ప్రారంభం మాత్రమే. ఎన్నికల నోటిఫికేషన్ రావడంతోనే ఉధృతమైన తిరుగుబాటు మొదలవుతుంది. వైకాపా నాయకులు రోడ్డుమీద తిరగాలంటే భయపడే పరిస్థితి వస్తుంది. ఇప్పటివరకు విశాఖను దోచేసిన వ్యక్తిని నెల్లూరుకు పంపిస్తున్నారు. అక్కడ మొత్తం ఊడ్చేశారు.. ఇప్పుడు నెల్లూరుకు వస్తే ఇక్కడా ఏమీ మిగలదు. తనకు ఎవరూ ఎదురు ఉండొద్దనే నియంతృత్వ ధోరణిలో జగన్ ముందుకెళ్తున్నారు. దోచుకున్న డబ్బుతో ఎక్కడ పడితే అక్కడ సిద్ధం.. సిద్ధం.. అని ప్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు. మొదట్లో సిద్ధం అంటే అర్థం కాలేదు. ఆ తర్వాత ఆలోచిస్తే... ఓడిపోయేందుకే జగన్ 'సిద్ధం' అని అంటున్నట్లు అర్థమైందని చంద్రబాబు ఎద్దేవా చేశారు.ముఖ్యమంత్రి జగన్ విధానాలతో ప్రజల్లోనే కాదు, వైసీపీ కార్యకర్తల్లోనే తిరుగుబాటు మొదలైందని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఈ సందర్భంగా అన్నారు. వెయ్యికి వెయ్యి శాతం టీడీపీ జనసేన కూటమి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఇది ఆరంభం మాత్రమే అని.. ఎన్నికల కోడ్ వచ్చాక ఇంకా మార్పు వస్తుందని తెలిపారు. వైసీపీ రౌడీలని రోడ్లపై తరిమికొట్టే రోజులు వస్తున్నాయన్నారు. విశాఖపట్నాన్ని దోచేసిన వ్యక్తి విజయసాయిని నెల్లూరుకి పంపిస్తున్నారన్నారు. దోచుకున్న డబ్బుతో సిద్ధం అంటూ హోర్డింగులా? అంటూ మండిపడ్డారు. ఇన్నాళ్ల రాజకీయాల్లో ఎన్నడూ చూడలేదని.. దేనికి సిద్ధం... ఓడిపోవడానికి సిద్ధమా అని ప్రశ్నించారు. 85 మంది జాబితా విడుదల చేసి కిందాపైనా పడుతున్నారు. ఒకాయనకి అధికారంలో ఉన్నప్పుడు బట్టలు కూడా నిలవలేదు.. తంతే నరసరావుపేటలో పోయిపడ్డాడు. బుల్లెట్ దిగిందా? లేదా? పల్నాడులో తంతే చెన్నైకి పోతాడు. ఎంపీలు, ఎమ్మెల్సీలు తమ పదవులకంటే రాష్ట్ర భవిష్యత్తు ముఖ్యమని వచ్చేస్తున్నారు. గంగాధర్ నెల్లూరులో డిప్యూటీ సీఎంని మార్చారు. మంగళగిరిలో ఇప్పటికి ముగ్గురుని మార్చారు. ఇలాంటి పరిస్థితులు చూశామా? జగన్ ఒక మోసగాడు. తప్పుడు లెక్కలతో మోసం చేస్తున్నాడు. సీఎం సభల నుంచి జనం పారిపోకుండా పోలీసుల కాపాలనా?. ఆయన హెలికాప్టర్ లో వస్తే కింద ట్రాఫిక్ ఆపేస్తారు. చెట్లు నరికేస్తారు. ఊరికో సైకోని తయారు చేశారు. మొన్ననే సోమిరెడ్డిపై ఒక సైకో గడ్డపారతో హత్యాయత్నానికి పాల్పడ్డాడు. టీడీపీ అధికారంలోకి వచ్చిన రెండు గంటల్లో రౌడీల ఆటకట్టిస్తాం. వివేకా హత్య కేసు అయిదేళ్లుగా ఎందుకు తేలడం లేదు?. నిన్ననే చెల్లెలు అడిగింది. సమాధానం చెప్పడానికి సిద్ధమా? గొడ్డలిపోటుని గుండెపోటని ఎందుకు చెప్పావ్?... నీకూ సంబంధం ఉంది కాబట్టే గుండెపోటని చెప్పావు. సొంత చెల్లెలు షర్మిలాకి ఆస్తిపాస్తులు ఇవ్వలేదు. ఎన్నికలకి ముందు గెలుపు కోసం వాడుకుని టిష్యూపేపర్‌లా తీసిపారేశాడు. నీ సొంత సోదరి, నీ తల్లి... నీ చె÷-లలెలు మీద నీచంగా సోషల్ మీడియాలో పోస్టింగులు పెడతారా? కనీసం ఖండించారా? ఇంత నీచమైన, దగాకోరు రాజకీయాలా? నేరస్థులు, నేర స్వభావం ఉండేవారు ఎంత నీచానికైనా దిగజారితే పరిస్థితులు ఇలాగే ఉంటాయి' టీడీపీ అధినేత వ్యాఖ్యలు చేశారు. మొన్న ఓ వ్యక్తి లారీ ఓనర్‌గా ఉండేవాడు క్లీనర్‌గా మారాడు. మరో వ్యక్తి అప్పులపాలై హోటల్ అమ్ముకుని, తోపుడు బండి పెట్టుకున్నాడు. రంగనాయకమ్మ ప్రశ్నించినందుకు తీవ్ర ఇబ్బందులు పెట్టారు. గుంటూరు వదిలిపెట్టి హైదరాబాదుకి వెళ్లి పొట్ట పోసుకుంటుంది. చాలా మందిని వీళ్లే చంపేశారు. ఒక్క పల్నాడులో 30 మందిని హతమార్చారు. మంచినీరు అడిగినందుకు ఓ మహిళని ట్రాక్టర్ తో తొక్కించి హతమార్చారు. మాస్క్ అడిగినందుకు డాక్టర్ సుధాకర్ ని వేధించి చంపేశారు. ఈరోజు కులాలని రెచ్చగొడుతున్నారు. టీడీపీ – జనసేన పొత్తుపెట్టుకుంటే వైసీపీకి బాధొచ్చింది. రాష్ట్రం కోసం పొత్తుపెట్టుకుంటే తప్పేంటి?. ఎవరికీ ఇవ్వని గౌరవం పవన్ కళ్యాణ్‌కు, జనసేన శ్రేణులకు ఇస్తున్నాం. కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి కలిగాచుకునే రకం వీళ్లు. ఒక్కఛాన్స్ అంటూ ముద్దులు పెట్టి, ఇప్పుడు పిడిగుద్దులు గుద్దుతున్నారు. ఏ ఒక్క వర్గమైనా ఆనందంగా ఉన్నారా? అన్ని రంగాలు, అన్ని కులాలు దెబ్బతిన్నారు. నెల్లూరు జిల్లా రాజకీయ చైతన్యం ఉండే జిల్లా. రెడ్లకి న్యాయం చేసి గౌరవంగా చూసి ఉంటే నలుగురు రెడ్లు టీడీపీకి వస్తారా? అని చంద్రబాబు ప్రశ్నలు కురిపించారు. నెల్లూరు జిల్లాలో గనులు దోచేశారని... ఇసుక, సిలికా వంటివి మొత్తం దోచుకున్నారని ఆరోపించారు. నలుగురు రెడ్లు పెద్దిరెడ్డి, సజ్జల, సుబ్బారెడ్డి, విజయసాయి తప్పించి మరెవరు బాగుపడలేదన్నారు. ఉమ్మడి నెల్లూరులో పదికి పది గెలిపించడానికి టీడీపీ, జనసేన కార్యకర్తలు ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని కోరారు. పాలూ నీళ్లులా కలిసి పోయారన్నారు. మాజీ మంత్రి నారాయణను ఎన్ని ఇబ్బందులు పెడుతున్నారో చూస్తున్నామని.. గట్టిగా పోరాడుతున్నారని తెలిపారు. సర్వే రిపోర్టులు చూస్తే... వీపీఆర్‌కు మంచి ఫలితాలొచ్చాయన్నారు. 99 సీట్లు కేటాయించాక, తాడేపల్లి కొంపలో భయపడిపోయారన్నారు. తాడేపల్లి మొత్తం షేక్ అవుతోందని.. అభ్యర్థులని మార్చేస్తున్నారని.. ఏ ఒక్కరూ గెలిచే పరిస్థితులు లేవన్నారు. అధికారులు తప్పుడు పనులు చేస్తే, జగన్‌తో పాటే ఇబ్బందులు పడతారని చంద్రబాబు నాయుడు వెల్లడించారు.

# మంగళగిరిలో లావణ్యను గెలిపిస్తా

### సిఎంకు విజయాన్ని కానుకగా ఇస్తా - ఎమ్మెల్యే ఆల్ల రామకృష్ణారెడ్డి వెల్లడి

**గుంటూరు:** మంగళగిరి నియోజకవర్గంలో వైసీపీ సమన్వయకర్తగా గంజి చిరంజీవి స్థానంలో మురుగుడు లావణ్యను వైసీపీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు జాబితాను శుక్రవారం విడుదల చేసింది. ఈ అంశంపై ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి స్పందించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో మంగళగిరి సీటును గెలిపించి జగనన్నకు కానుకగా ఇస్తామని స్పష్టం చేశారు. ఇక్కడ టీడీపీకి మరోసారి భంగపాటు తప్పదన్నారు. మళ్లీ మళ్లీ చెప్తున్నా.. వచ్చే ఎన్నికల్లో మంగళగిరిలో వైసీపీ జెండా ఎగురవేస్తాం. లావణ్య రాజకీయ కుటుంబం నుంచి వచ్చారు. ఆమె గెలుపు ఖాయం. 2024 ఎన్నికల్లో మంగళగిరి నియోజకవర్గంలో నాన్ లోకల్, బీసీ అభ్యర్థుల మధ్యే పోటీ ఉంటుందని ఆర్కే పేర్కొన్నారు. కాగా, ఈ స్థానంలో టీడీపీ నుంచి ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ బరిలో నిలిచారు. ఓడిన చోటే మళ్లీ గెలిచి చూపించాలని పక్కా ప్రణాళికలు, విస్తృత ప్రచారాలతో లోకేశ్ హోరెత్తిస్తుండగా.. ఈసారి కూడా గెలిచి తమ సత్తా చాటాలని వైసీపీ భావిస్తోంది. ఈ క్రమంలో సీఎం జగన్ టీడీపీ కీలక స్థానాలపై ఫుల్ ఫోకస్ పెట్టారు. అందుకు అనుగుణంగానే రాజకీయ వ్యూహాల్లో భాగంగా మంగళగిరిలో లావణ్యను బరిలో నిలిపారు. లావణ్యకు పుట్టినింటి నుంచీ మెట్టినింటి వరకూ రాజకీయ నేపథ్యం ఉంది. లావణ్య తల్లి కాంద్రు కమల 2009 నుంచి 2014 వరకూ మంగళగిరి ఎమ్మెల్యేగా ఉన్నారు. 2004 నుంచి 2009 వరకూ మంగళగిరి మున్సిపల్ ఛైర్ పర్సన్ గానూ పని చేశారు. లావణ్య మామ మురుగుడు హనుమంతరావు ప్రస్తుతం ఎమ్మెల్సీగా, ఎథిక్స్ కమిటీ ఛైర్మన్ గా ఉన్నారు. అంతకు ముందు రెండుసార్లు ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అంతే కాకుండా, 2004లో వైఎస్ కేబినెట్ లోనూ పని చేశారు. మంగళగిరిలో ఈసారి కూడా పాగా వేయాలని చూస్తోన్న జగన్.. అందుకు అనుగుణంగా లావణ్యను బరిలో నిలిపినట్లు తెలుస్తోంది.

# టికెట్ నిరాకరించిన బీజేపీ.. రాజకీయాల నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన మాజీ కేంద్రమంత్రి హర్షవర్ధన్

**హైదరాబాద్ :** 2024 లోక్‌సభ ఎన్నికలకు భారతీయ జనతా పార్టీ తొలి విడత జాబితా ప్రకటించింది. అయితే, దేశ రాజధాని ఢిల్లీలోని చాందినీ చౌక్ లోక్‌సభ స్థానం నుంచి ఎంపీగా కొనసాగుతున్న డాక్టర్ హర్షవర్ధన్ రాజకీయాల నుంచి రిటైర్మెంట్ ప్రకటించారు. అయితే, ఈ సారి టికెట్ ఇచ్చేందుకు హైకమాండ్ నిరాకరించింది. ఆయన స్థానంలో ప్రవీణ్ ఖండేల్వాల్‌కు టికెట్ ఇచ్చింది. దీంతో నిరాశకు గురైన ఆయన రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ఎంపీ గౌతమ్ గంభీర్, హజారీభాగ్ ఎంపీ జయంత్ సిన్హా క్రియాశీల రాజకీయాల నుంచి తప్పించాలని కోరారు. తాజాగా మాజీ కేంద్రమంత్రి హర్షవర్ధన్ సైతం క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ద్వారా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. డాక్టర్ హర్షవర్ధన్ దాదాపు సంవత్సరాలకుపైగా రాజకీయాల్లో కొనసాగారు. మొత్తం ఐదుసార్లు అసెంబ్లీ, రెండుసార్లు పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చోటీ గెలుపొందారు. దాంతో పాటు పార్టీ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల్లోనూ కీలక పదవులను చేపట్టారు. ఆయన మళ్లీ తిరిగి డాక్టర్ వృత్తిని కొనసాగించేందుకు నిర్ణయం తీసుకున్నారు. కృష్ణానగర్‌లోని ఈఎన్‌టీ క్లినిక్‌కు తిరిగి వెళ్లేందుకు ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. 50 సంవత్సరాల కిందట పేదలకు సహాయం అందించాలనే కోరికతో కాన్పూర్‌లోని ఎస్‌ఎస్‌వీఎం మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ అడ్మిషన్ తీసుకున్నానని.. ఆ సమయంలో మానవాళికి సేవ చేయడమే నినాదమని పేర్కొన్నారు. అయితే, అప్పటి ఆర్ఎస్ఎస్ నాయకత్వం అభ్యర్థన మేరకు ఎన్నికల రంగంలోకి వచ్చానన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు, అభిమానాలు, మద్దతు తెలిపిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. మూడు దశాబ్దాలకుపైగా సాగిన ప్రయాణానికి ఎంతో



దోహదపడ్డారన్నారు. ఇదిలా ఉండగా.. బీజేపీ విడుదల చేసిన తొలి విడత జాబితాలో ఢిల్లీలోని ఐదుస్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇందులో చాందినీ చౌక్, న్యూఢిల్లీ, ఈశాన్య ఢిల్లీ, దక్షిణ ఢిల్లీ, పశ్చిమ ఢిల్లీ స్థానాలున్నాయి. ఈశాన్య ఢిల్లీ ఎంపీ మనోజ్ తివారీ మినహా సిట్టింగ్‌లకు మళ్లీ సీట్లు ఇచ్చేందుకు బీజేపీ అధిష్ఠానం నిరాకరించింది.

# రూ.400 కోట్ల విలువైన ఫామ్ హౌజ్ కూల్చివేత.. ఎందుకంటే..!

**న్యూఢిల్లీ:** ఉత్తరప్రదేశ్‌కు చెందిన లిక్కర్ కింగ్ పాంటీ చద్దా సంబంధించిన వందల కోట్ల విలువైన ఫామ్‌హౌజ్‌ను ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులు కూల్చేశారు. దేశ రాజధాని ఢిల్లీలోని ఛత్రపూర్ ఏరియాలో లిక్కర్ వ్యాపారి పాంటీ చద్దా కుటుంబానికి ఫామ్‌హౌజ్ ఉంది. ఆ ఫామ్ హౌజ్ విలువ రూ.400 కోట్ల కంటే పైనే ఉంటుందని అధికారులు చెబుతున్నారు. పాంటీ చద్దా ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఈ ఫామ్‌హౌజ్‌ను నిర్మించినట్లు అధికారులు గుర్తించారు. దాంతో శుక్ర, శనివారాలు సామగ్రితో వచ్చి ఆ ఫామ్‌హౌజ్‌ను పూర్తిగా నేలమట్టం చేశారు. ప్రస్తుతం ఈ ఫామ్‌హౌజ్ పాంటీ చద్దా కుమారుడు మన్‌ప్రీత్ అలియాస్ మాంటీ చద్దా కబ్జాలో ఉంది. ఈ ఫామ్‌హౌజ్‌లోనే గతంలో పాంటీ చద్దా, అతడి చిన్న తమ్ముడు హర్దీప్ గొడవపడి ప్రాణాలు పోగొట్టుకున్నారు. గొడవ ముదరడంతో హర్దీప్ తన అన్న పాంటీ చద్దాను తుపాకీతో కాల్చిచంపాడు. దాంతో పాంటీ అంగరక్షకుడు హర్దీప్‌ను కాల్చేశాడు. తన అన్నదమ్ములిద్దరూ క్షణాల వ్యవధిలో ప్రాణాలు కోల్పోయారు. కాగా, 'ఢిల్లీలో ప్రభుత్వ భూముల్లో నిర్మించిన అక్రమ కట్టడాల కూల్చివేత కొనసాగుతోంది. ఈ క్రమంలో పాంటీ చద్దా అలియాస్ గురుదీప్ సింగ్ అక్రమంగా నిర్మించిన ఫామ్‌హౌస్‌ను కూడా కూల్చివేశాం' అని అధికారులు తెలిపారు. పాంటీ ఫామ్‌హౌజ్ ఛత్రపూర్‌లో దాదాపు పది ఎకరాలకుపైగా భూమిలో విస్తరించి ఉంది. దీని విలువ రూ.400 కోట్లని డీడీఏ



అధికారులు వెల్లడించారు. శుక్రవారం ఐదెకరాలను స్వాధీనం చేసుకోగా.. శనివారం ప్రధాన భవనాన్ని కూల్చివేసి మిగిలిన భూమిని ఆధీనంలోకి తెచ్చుకున్నట్టు తెలిపారు. ఫామ్ హౌజ్‌లో గార్డెన్, ఔట్ హౌజ్, ప్రధాన భవనం ఉన్నాయి. ఈ ఘటనపై చద్దాకు చెందిన వేవ్ గ్రూప్ స్పందించలేదు. ఈ గ్రూప్ యూపీలో లిక్కర్, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు నిర్వహిస్తోంది.

# జనసేన అభ్యర్థులను ఓడించడానికి చంద్రబాబు చాలు.. ఎంపీ కేశినేని నాని సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్ :** జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పరిస్థితిని చూస్తే జాలేస్తోందని విజయవాడ ఎంపీ కేశినేని నాని అన్నారు. ఆదివారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. కేవలం 24 సీట్ల కోసం చంద్రబాబు, లోకేశ్ దగ్గర జనసేన కార్యకర్తల ఆత్మగౌరవాన్ని పవన్ కళ్యాణ్ తాకట్టు పెట్టాడని విమర్శించారు. 2009 ఎన్నికల సమయంలో పంచలూడగొడతా అని అన్నాడు.. ఇప్పుడేమో పాతాళానికి తొక్కేస్తానని అంటున్నాడని చెప్పారు. వైఎస్ జగన్ నిలబెట్టిన అభ్యర్థులపై ఓడిపోయి ప్రగల్భాలు పలకడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. అయినా గ్లాస్ గుర్తును ఓడించడానికి చంద్రబాబు చాలని విమర్శించారు. పవన్ కళ్యాణ్ నిలబెట్టిన 24 మంది అభ్యర్థులను చంద్రబాబే ఓడిస్తాడని ఎద్దేవా చేశారు. కరోనా సమయంలోనూ ఇచ్చిన మాట తప్పకుండా పనిచేసిన కమిట్‌మెంట్ ఉన్న నాయకుడు జగన్ అని కేశినేని నాని కొనియాడారు. సంక్షేమం పేరుతో అభివృద్ధి చేయడం లేదని జగన్‌ను చంద్రబాబు విమర్శిస్తున్నారని అన్నారు. విజయవాడకు చంద్రబాబు వంద కోట్లయినా ఇచ్చాడా? అని నిలదీశారు. డ్రైనేజీ వ్యవస్థ కోసం తాను కేంద్రం నుంచి 400 కోట్లు తెస్తే.. ఆ నిధులను కూడా చంద్రబాబు నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ఆ నిధులు అన్నీ తన పలుకుబడి ఉపయోగించి తెచ్చినవే అని స్పష్టం చేశారు. ఈ విషయంలో చంద్రబాబుతో చర్చకు సిద్ధమని సవాలు విసిరారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం 33 వేల ఎకరాలను చంద్రబాబు రైతుల నుంచి తీసుకున్నాడని కేశినేని నాని ఆరోపించారు. తాత్కాలిక సచివాలయం, అసెంబ్లీ, కోర్టు తప్ప ఐదేండ్లలో నువ్వు కట్టిందేంటి? అని చంద్రబాబును నిలదీశారు. తాను వైసీపీలో చేరిన తర్వాత 100కి పైగా సచివాలయాలు ప్రారంభించానని తెలిపారు. అమరావతి కోసం చంద్రబాబు 3 వేల కోట్లు అయినా ఖర్చు చేశాడా? అని ప్రశ్నించారు.



ప్రతి గ్రామానికి ఒక సచివాలయం కట్టి జగన్ ప్రజలకు మంచి పాలన అందిస్తున్నారని స్పష్టం చేశారు. 80 వేల కోట్లతో మెడికల్ కాలేజీలు కట్టిస్తున్న వ్యక్తి జగన్ అని కొనియాడారు.

# మేం మీ కీలు బొమ్మలం కాదు.. చైనాకు స్పష్టం చేసిన తైవాన్

**న్యూఢిల్లీ:** మా విదేశాంగ మంత్రి జోసఫ్ వూని భారత ఆంగ్ల మీడియా ఇంటర్వ్యూ చేస్తే చైనాకు అభ్యంతరం దేనికని తైవాన్ ప్రశ్నించింది. భారత్, తైవాన్ దేశాలు పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాలో అంతర్భాగాలు కావని ఘాటుగా వ్యాఖ్యానించింది. చైనాకు తాము కీలు బొమ్మలం కాదని స్పష్టం చేసింది. పత్రికా స్వేచ్ఛ భారత్, తైవాన్ రెండు దేశాల ప్రజాస్వామ్యాల్లో ఉన్నదని తెలిపింది. ఈ మేరకు ఒక ప్రకటన చేసింది. అంతేగాక, చైనా పొరుగు దేశాలను వేధించడం మానుకుని, తమ ఆర్థిక వ్యవస్థ కుంగిపోతుండటంపై ఆందోళన చెందాలని తైవాన్ హితవు పలికింది. ఇదిలావుంటే తైవాన్ నేషనల్ డేను ఏ విధంగా కవర్ చేయాలో 2020లో చైనా దౌత్యకార్యాలయం భారత మీడియాకు పాఠాలు చెప్పింది. ఈ మేరకు జర్నలిస్టులకు మెయిల్స్ పంపింది. దీనిపై నాడు భారత ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. మా దేశంలో మీడియాకు స్వేచ్ఛ ఉందని, సరైనది అనుకున్న అంశాలను మీడియా రిపోర్టు చేస్తుందని చైనా దౌత్య కార్యాలయానికి



భారత్ సమాధానం ఇచ్చింది. అప్పుడు కూడా తైవాన్ విదేశాంగ శాఖ భారత మీడియాకు అండగా నిలిచింది. తాజాగా భారత మీడియా తైవాన్ విదేశాంగ మంత్రిని ఇంటర్వ్యూ చేయడం చైనాకు ఆగ్రహం తెప్పించింది. మా అనుమతి లేకుండా ఇంటర్వ్యూ ఎలా చేస్తారంటూ భారత్‌పై మండిపడింది. భారత మీడియా ద్వైపాక్షిక ఒప్పందాలను ఉల్లంఘిస్తోందని చైనా ఆరోపించింది. భారత్‌కు చెందిన ఆంగ్ల మీడియా ఫిబ్రవరి ఆఖరులో తైవాన్ విదేశాంగ మంత్రి జోసఫ్ వూ ఇంటర్వ్యూను ప్రసారం చేసింది.

ఈ ఇంటర్వ్యూలో తైవాన్‌కు చెందిన అంశాలపై ఆయన మాట్లాడారు. దాంతో ఆగ్రహించిన చైనా.. భారత మీడియా తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తోందని, తైవాన్ స్వాతంత్ర్యానికి వేదికను కల్పిస్తోందని ఆరోపించింది. అది ఒకే చైనా సూత్రానికి విరుద్ధమని పేర్కొంది. తాము ఇలాంటి వాటిని ఏమాత్రం అంగీకరించబోమని తెలిపింది. ప్రపంచంలో ఒక్క చైనా మాత్రమే ఉందని, తైవాన్ తమలో అంతర్భాగమని వ్యాఖ్యా నించింది. పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా ప్రభుత్వమే అంతటికి ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపింది.

## భక్తజన సంద్రం కొమురవెల్లి క్షేత్రం



**చేర్యాల :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవలి శ్రీ మల్లికార్జున స్వామి వారి క్షేత్రం ఆదివారం భక్తులతోకిక్కిరిసిపోయింది. 7వ వారానికి కరీంనగర్, వరంగల్ తదితర పూర్వపు జిల్లాల నుంచి సుమారు 25వేల మంది భక్తులు మల్లన్న క్షేత్రానికి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ట్రాక్టర్లు, ఆటోలతో పాటు ఆర్టీసీ బస్సుల్లో భక్తులు భారీగా తంలిరావడంతో క్షేత్రంలోని పార్కింగ్ స్థలాలు నిండిపోయాయి. మల్లన్న దర్శనంతో భక్తులు పులకరించిపోయారు. శనివారం రాత్రి నుంచే మొదలైన భక్తుల రాక ఆదివారం సాయంత్రం వరకు కొనసాగింది. భక్తులు కోనేటిలో పవిత్ర స్నానాలు అచరించి క్యూలైన్ల ద్వారా స్వామి వారి ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు.

## అంగవైకల్యాన్ని శాశ్వతంగా పారద్రోలేందుకు పల్స్‌పోలియో : టీటీడీ ఈవో



**తిరుమల :** సమాజం నుంచి అంగ వైకల్యాన్ని పారద్రోలేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న పల్స్‌పోలియోను విజయవంతం చేయాలని టీటీడీ ఈవో ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం దేశ వ్యాప్తంగా నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా తిరుమల శ్రీవారి ఆలయం వద్ద ఆయన చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తిరుమలలో 25 ప్రాంతాలలో పల్స్‌పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే పల్స్‌పోలియో కార్యక్రమంలో భక్తులు, స్థానికులు 0 నుండి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు విధిగా పల్స్‌పోలియో చుక్కలు వేయించాలని కోరారు. రెండు చుక్కలు చిన్నారుల జీవితాలకు ఎంతో మేలు చేస్తాయని చెప్పారు.

## చిన్నారులకు పోలియో చేక్కలు వేసిన మంత్రి దామోదర రాజనరసింహ



**లసంగారెడ్డి :** ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేసి పోలియోను నివారించాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆదివారం జోగిపేట వంద పడకల ప్రభుత్వ దవాఖానలో పల్స్ పోలియోకార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రసూతి వార్డులో పలువురు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలియో నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. పోలియో రహిత సమాజం కోసం కలిసికట్టుగా పోరాడుదామన్నారు. అనంతరం జోగిపేట ఏరియా దవాఖానలో ఎమర్జెన్సీ సౌకర్యం కోసం నూతన అంబులెన్స్‌ను అందజేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి గాయత్రి దేవి ఆర్డీఓ పాండు, సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## ఫొటోషూట్ ఉందంటూ తీసుకెళ్లి దారుణ హత్య.. పోలీసుల అదుపులో నిందితుడు



**అమరావతి :** జీవితంలో స్థిరపడాలని ఆ యువ ఫొటోగ్రాఫర్ కన్న కలలు నీరు గారయ్యాయి. అతడి వద్ద ఉన్న విలువైన కెమెరాలను దొంగిలించడానికి ఫొటోషూట్ ఉందంటూ తీసుకెళ్లి దారుణంగా హత్య చేసిన విషాద ఘటన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో చోటు చేసుకుంది. విశాఖ జిల్లా మధురవాడ బక్కన్నపాలెంకుచెందిన పోతిన సాయికుమార్(23) పెళ్లి వేడుకలకు ఫొటోలు, వీడియోలు చిత్రీకరణ చేస్తూ దూర ప్రాంతాలకు సైతం ఫొటోషూట్‌కు వెళ్తుంటాడు. గత నెల 26న కోనసీమ జిల్లా రావులపాలెం ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకులు వచ్చి పదిరోజుల ఫొటోషూట్ ఉందని పిలిచారు. పెళ్లి వేడకల చిత్రీకరణకు రావులపాలెం వెళ్తున్నట్లు తల్లిదండ్రులకు చెప్పి విశాఖ రైలు ఎక్కి రాజమహేంద్రవరంలో దిగాడు. అక్కడ ఇద్దరు యువకులు కారులో వచ్చి సాయికుమార్‌ను రావులపాలెం ప్రాంతానికి తీసుకెళ్లి హత్య చేసి పూడ్చిపెట్టారు. అనంతరం అతడి వద్ద ఉన్న కెమెరా, సామగ్రిని తీసుకెళ్లారు. తల్లిదండ్రులు సాయికుమార్ కోసం ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ రావడంతో విశాఖలోని పీఎం పాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టి మృతుడి ఫోన్ కాల్‌డేటా ఆధారంగా నిందితుల్లో ఒకరైన షణ్ముఖతేజను అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ విచారణలో వాస్తవాలు తెలియడంతో మరో నిందితుడు పరారీలో ఉన్నారు. కెమెరా, సామగ్రి కోసమే సాయికుమార్‌ను హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో వెల్లడయ్యింది.

## పాకిస్థాన్ ప్రధానిగా వరుసగా రెండోసారి షెహబాజ్ షరీఫ్ ఎన్నిక



**హైదరాబాద్ :** పాకిస్థాన్ ప్రధానమంత్రిగా వరుసగా రెండో సారీ పాక్ ముస్లింలీగ్-నవాజ్ పార్టీ అగ్రనేత షెహబాజ్ షరీఫ్ ఎన్నికయ్యారు. 72 ఏళ్ల షెహబాజ్ దేశ 33వ ప్రధానిగా బాధ్యతలు చేపట్టబోతున్నారు.

## నిధులున్నప్పటికీ జీతాలు ఇవ్వలేకపోతున్న.. బైజూస్ ఉద్యోగులకు రవీంద్రన్ లేఖ




**న్యూఢిల్లీ :** నిధులున్నప్పటికీ, ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి బైజూస్‌లో ఏర్పడింది. లీగల్ వివాదం కారణంగా రైట్స్ ఇష్యూ ద్వారా ఇటీవల సమీకరించిన డబ్బును తీసుకోలేకపోతున్నామని ఉద్యోగులకు బైజూస్ వ్యవస్థాపకుడు బైజూ రవీంద్రన్ లేఖ రాశారు. బైజూస్ బ్రాండ్‌నేమ్‌తో కార్యకలాపాలు నిర్వహిస్తున్న మాతృసంస్థ థింక్ అండ్ లెర్న్ ప్రైవేట్ లిమిటెడ్‌ను పలు ఈడీ, కార్పొరేట్ వ్యవహారాల శాఖ స్క్రూటినీ చేస్తుండగా, రవీంద్రన్‌ను నాయ కత్వం నుంచి తప్పించాలంటూ ఇటీవల కంపెనీ అత్యవసర సర్వసభ్య సమావేశం నిర్వహించిన సంగతి తెలిసిందే.అయితే ఆర్థిక ఇబ్బందుల్లోపడ్డప్పటికీ బైజూస్ రూ.1,600 కోట్ల రైట్స్ ఇష్యూను విజయవంతంగా పూర్తిచేసింది. కానీ యూఎస్‌లోని హెడ్జ్ ఫండ్ నిధుల్ని బైజూస్ దారిమళ్లించిందని, ఈ రైట్స్ ఇష్యూ చట్టవిరుద్ధమని, దానిపై స్టే ఇవ్వాలని కొంతమంది ఇన్వెస్టర్లు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ నిధుల్ని ప్రత్యేక ఎస్క్రో ఖాతాలో ఉంచాలని, విత్‌డ్రా చేయరాదని ఎన్సీఎల్టీ బెంగళూరు బెంచ్ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది.

## వన్యప్రాణి మాంసం స్వాధీనం.. ఇద్దరిపై కేసు నమోదు



**మహదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని సూరారం గ్రామంలో వన్యప్రాణి మాంసాన్ని అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అటవీ శాఖ మండల అధికారి కమల తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ప్రధాన రహదారిపై శనివారం సాయంత్రం పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో మాదోట సురేశ్ వద్ద వన్యప్రాణి దుప్పి సుమారు కేజీబరువు గల) మాంసం ఉన్నట్లు తెలిసింది.దీంతో అతడి ఇంటికి వెళ్లి తనిఖీ చేయగా దుప్పి మాంసం దొరకడంతో అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న అటవీ శాఖ బీట్ అధికారి కృపాకర్, సెక్షన్ అధికారి వరుణ్ పంచనామా చేసి విచారించారు. అదే గ్రామానికి చెందిన కుంభం రమేశ్ వద్ద నుంచి మాదోట సురేశ్ దుప్పి మాంసం కొనుగోలు చేసినట్లు విచారణలో తేలింది. దీంతో వైల్డ్ లైఫ్ యాక్ట్ కింద వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్‌వో కమల తెలిపారు.కాగా, కుంభం రమేశ్ పరారీలో ఉన్నాడని, పట్టుబడిన నిందితుడిని కోర్టుకు తరలించనున్నట్లు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న మాంసాన్ని మండల కేంద్రంలోని ఫారెస్ట్ కార్యాలయాలనికి తరలించి, వైద్య పరీక్షల నిమిత్తం వెటర్నరీ వైద్యులకు అప్పగించినట్లు తెలిపారు. తదుపరి దానిని హైదరాబాద్‌లోని సీసీఎంబీ(సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ(కి తరలించనున్నట్లు మండల అటవీశాఖ అధికారి వెల్లడించారు.

## రెండు రోజుల్లో నీళ్లు వదలాలి లేదంటే ఉద్యమిస్తాం : ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



**నిజామాబాద్ :** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలో ప్రవహించే కప్పలవాగు, పెద్దవాగులో ప్యాకేజీ-21 ద్వారా ఏర్పాటు చేసిన అవుట్‌లెట్లతో నీరందించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. వాగు పరీవాహక గ్రామాల రైతుల కోరిక మేరకు గడిచిన 20రోజుల క్రితమే ఇరిగేషన్ సీఈతో ఫోన్‌లో మాట్లాడామని, అంతేగాకుండా నీళ్లు వదలాలని ఎమ్మెల్యేగా లెటర్ ద్వారా కూడా విన్నవించామన్నారు.అధికారులు కూడా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, నీటి విడుదల విషయంలో ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదని చెబుతున్నారని వివరించారు. ఇప్పటికైనా వాగుల్లోకి నీటిని వదలకపోతే ఆ రెండు వాగుల వెంట ఉన్న గ్రామాలకు చెందిన పంటలు ఎండిపోయే అవకాశమున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.మొదటి విడుతగా రోజుకు 300 క్యూసెక్కుల చొప్పున 10రోజులు 0.5టీఎంసీ నీరు వదలాలని ఎమ్మెల్యే వేముల డిమాండ్ చేశారు. రెండు రోజులు వేచిచూసి ప్రభుత్వం నీళ్లు వదలకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పరీవాహక గ్రామాల రైతులతో కలిసి తాను ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని హెచ్చరించారు.

## కోడెల మరణానికి చంద్రబాబే కారణం : అంబటి రాంబాబు సంచలన వ్యాఖ్యలు



**అమరావతి :** టీడీపీకి చెందిన సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కోడెల శివప్రసాద్ మరణానికి చంద్రబాబు కారణమని ఏపీ మంత్రి అంబటి రాంబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. సత్తెనపల్లిలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ గత ఎన్నికల్లో కోడెల ఓటమి పాలైతే కనీసం ఆయనను పలకరించకపోగా వారి కుటుంబాన్ని రాజకీయంగా పక్కకు పెట్టడడంతో కోడెల మానసిక క్షోభకు గురై ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు.కోడెల లాంటి రాజకీయ నాయకుడు రాజకీయంగా శత్రువులకు బయపడే వారు కాదని అన్నారు. కోడెల ఆత్మహత్యకు వైఎస్ జగన్ కారణమని చేస్తున్న ఆరోపణలను ఆయన తిప్పిగొట్టారు. కోడెల పేరుతో ఎన్నికల్లో లబ్ధిపొందడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కోడెలపై ప్రేమ ఉంటే వారి కుటుంబంలో ఒకరికి టికెట్ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు.గత ఎన్నికల్లో పల్నాడ్ జిల్లాలో ఏడుగురు టీడీపీ అభ్యర్థులను ప్రజలు ఓడించారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మునిగిపోయే పడవను కాపాడుకోవాలని చంద్రబాబు తపన పడుతున్నారని ఆరోపించారు. వైసీపీ ఎమ్మెల్యేలను ఓడించే దమ్ము బాబుకు లేదని వెల్లడించారు. తన గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని లేదంటే చంద్రబాబు బండారం బయట పెడుతానని హెచ్చరించారు.

## జనసేన నేత పవన్ కల్యాణ్‌ను కలిసిన వైసీపీ ఎమ్మెల్యే



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వైసీపీ ఎమ్మెల్యే జనసేన నేతను కలవడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. ఎన్నికలు త్వరలో జరుగనున్న తరుణంలో వైసీపీకి చెందిన అసంతృప్త ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ ఒక్కొక్కరు ఇతర పార్టీల్లో జాయిన్ అవుతున్నారు. తాజాగా ఆదివారం చిత్తూరు ఎమ్మెల్యే ఆరెని శ్రీనివాసులు పవన్‌కల్యాణ్‌ను కలవడం సంచలనం కలిగించింది.వైసీపీ అధ్యక్షుడు,ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్తూరు అసెంబ్లీ ఇన్‌చార్జ్‌గా విజయానందరెడ్డి నియవి ంచడంతో శ్రీనివాసులు నిరాశలో ఉన్నారు.

# కొత్త శిఖరాలకు సూచీలు.. స్పెషల్ ట్రేడింగ్‌లోనూ లాభాల్లో స్టాక్ మార్కెట్లు



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు శనివారం జరిగిన స్పెషల్ ట్రేడింగ్‌లోనూ ఆల్‌టైమ్ హై రికార్డులను సృష్టించాయి. ఉదయం, మధ్యాహ్నం వేర్వేరుగా చేపట్టిన రెండు సెషన్లలో సూచీలు చివరకు లాభాల్లోనే ముగిశాయి. కాగా, ప్రైమరీ (పీఆ ర్) సైట్‌లో వైఫల్యం లేదా పెను అంతరాయం ఏర్పడినప్పుడు దాన్ని ఎదుర్కొనే సంసిద్ధతను పరీక్షించడానికి అటు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ), ఇటు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)ల్లో ఈ ప్రత్యేక ట్రేడింగ్ సెషన్లను చేపట్టారు. వీటిలో భాగంగానే ప్రైమరీ సైట్ నుంచి డిజాస్టర్ రికవరీ (డీఆర్) సైట్‌కు స్పెషల్ లైవ్ ట్రేడింగ్‌ను మార్చి టెస్ట్ చేశారు.తొలి సెషన్‌లో..తొలి సెషన్‌లో భాగంగా ప్రైమరీ (పీఆర్) సైట్‌లో ఉదయం 9:15 గంటలకు ప్రత్యేక ట్రేడింగ్ ఆరంభమైంది. 45 నిమిషాలపాటు సాగిన ఈ ట్రేడింగ్ 10 గంటలకు ముగిసింది. ఈ క్రమంలో బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 114.91 పాయింట్లు లేదా 0.16 శాతం ఎగి సి 73,860.26 వద్ద నిలిచింది. ఒకానొక దశలో 73,982.12 స్థాయిని తాకింది. ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ కూడా 56.25 పాయింట్లు లేదా 0.25 శాతం ఎగబాకి 22,395 వద్ద స్థిరపడింది. ఇంట్రా-డేలో 22,420.25 స్థాయిని చేరింది. ఇదే నిఫ్టీకి ఇంట్రా-డే హై రికార్డు కావడం గమనార్హం.రెండో సెషన్‌లో..రెండో సెషన్‌లో భాగంగా డిజాస్టర్ రికవరీ (డీఆర్) సైట్‌లో ఉదయం 11:30 గంటలకు ప్రత్యేక ట్రేడింగ్ మొదలైంది. గంటపాటు జరిగిన ఈ ట్రేడింగ్ మధ్యాహ్నం 12:30 గంటలకు అయిపోయింది. తొలి సెషన్‌లో ఎక్కడైతే సూచీలు ముగిశాయో అక్కడి నుంచే రెండో సెషన్‌లో ట్రేడింగ్ ఆరంభమైంది. అయితే మొదటి సెషన్‌తో పోల్చితే రెండో సెషన్‌లో మదుపరులు లాభాల స్వీకరణకు దిగారు. ఈ క్రమంలోనే సూచీలు తగ్గుముఖం పట్టాయి. అయినప్పటికీ మును ఎన్నడూ లేనివిధంగా సెన్సెక్స్ 73,806.15 పాయింట్ల ఆల్‌టైమ్ హై వద్ద ముగిసింది. ఇంట్రా-డేలోనూ 73,994.70 స్థాయికి చేరి రికార్డును సృష్టించింది.నిఫ్టీ కూడా 22,378.40 పాయింట్ల లైఫ్‌టైమ్ హై వద్ద స్థిరపడింది. దీంతో శుక్రవారం ముగింపుతో చూస్తే సెన్సెక్స్ 60.80 పాయింట్లు లేదా 0.08 శాతం, నిఫ్టీ 39.65 పాయింట్లు లేదా 0.18 శాతం పెరిగినైట్టైంది. మరోవైపు పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) నిబంధనల ఉల్లం ఘనకుగాను ఫైనాన్షియల్ ఇంటిలిజెన్స్ యూనిట్ (ఎఫ్ఐయూ) వేసిన 5.49 కోట్ల జరిమానాతో పేటీఎం షేర్లు శనివారం 2.50 శాతానికిపైగా నష్టపోయాయి.రూ.2 లక్షల కోట్లు జూమ్ బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ తొలిసారి రూ.394.06 లక్షల కోట్లకు చేరింది. ఈ ఒక్కరోజే సుమారు రూ.2 లక్షల కోట్లు ఎగిసింది. టాటా స్టీల్, టాటా మోటర్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, విప్రో, ఐటీసీ, ఏషియన్ పెయింట్స్ తదితర సంస్థల షేర్లు ఆకర్షణీయ లాభాలను అందుకున్నాయి. రంగాలవారీగా మెటల్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, రియల్టీ, హెల్త్‌కేర్ ఇండెక్స్‌లు 1.44 శాతం నుంచి 0.75 శాతం వరకు పెరిగాయి. ఇక బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 0.70 శాతం, మిడ్‌క్యాప్ సూచీ 0.67 శాతం పెరిగాయి.

# సోలార్‌పై సింగరేణి దూకుడు.. లోయర్ మానేరు, మల్లన్న సాగర్‌పై 800 మెగావాట్ల విద్యుత్తు!




**హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో భారీ జలాశయాలపై సుమారు 800 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం తెలిపారు. శనివారం ఇక్కడి సింగరేణి భవన్‌లో ఆయన విద్యుత్ విభాగంపై సంస్థ ఎలక్ట్రికల్-మెకానికల్ శాఖ డైరెక్టర్ డి సత్యనారాయణ రావుతోపాటు ఇతర ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్షను నిర్వహించారు.భారీ జలాశయాలపై సౌర ఫలకాల ఏర్పాటుతో విద్యుదుత్పత్తి పెంపునకు కృషి చేయాలని ప్రభుత్వం సూచించిన నేపథ్యంలో లోయర్ మానేరు డ్యాం నీటిపై 300 మెగావాట్లు, మల్లన్న సాగర్‌పై 500 మెగావాట్ల సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సీఎండీ ఆదేశించారు. అయితే లోయర్ మానేరు డ్యాంపై 300 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన డీపీఆర్ సిద్ధంగా ఉందని అధికారులు చెప్పున్నారు.దీంతో మల్లన్న సాగర్ జలాశయంపైనా రెండు 250 మెగావాట్ల ప్లాంట్ల ఏర్పాటుకు డీపీఆర్‌ను వెంటనే రూపొందించాలని అధికారులకు సీఎండీ సూచించారు. మరోవైపు రాజస్థాన్‌లో సింగరేణి ఏర్పాటు చేయతలపెట్టిన 500 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌పై కూడా అధికారులతో బలరాం సమీక్షించారు. మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద నిర్మించే 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రానికి సంబంధించిన టెండర్ ప్రక్రియను పూర్తిచేసి నిర్మాణం ప్రారంభించాలన్నారు.ఇంకోవైపు వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా రాష్ట్రంలో పవన విద్యుదుత్పత్తి కేంద్రాలకు అనువైన ప్రాంతాలను సందర్శించాలని, దీనికి సంబంధించి ఒక నివేదికను రూపొందించాలని అధికారులను సంస్థ సీఎండీ బలరాం ఆదేశించారు.

# జైలు గోడలు బద్దలు కొట్టి వందల మంది ఖైదీలు పరార్..!



**న్యూఢిల్లీ:** హైతీ దేశ రాజధాని పోర్ట్ ఆ ప్రిన్స్ రణరంగాన్ని తలపిస్తోంది. తీవ్రమైన నేరాలు చేసిన వారిని బంధించే ప్రధాన జైలులో ఖైదీల ముఠాలు ఒకరినొకరు కొట్టుకున్నారు. జైలు గోడలు బద్దలు కొట్టుకొని వందల మంది ఖైదీలు పారిపోతున్నారు. ఈ విషయాన్ని ఆ దేశ పోలీస్ యూనియన్ సోషల్ మీడియాలో పోస్టు చేసింది. రాజధానిలోని అధికారులందరూ తక్షణమే కార్లు, ఆయుధాలు తీసుకొని జైలును అదుపు చేయడానికి రావాలని అభ్యర్థించింది.అంతేగాక 'దాడి చేసేవారు పూర్తిగా విజయం సాధిస్తే దాదాపు 3,000 మంది నేరగాళ్లు పట్టణంలోకి వస్తారు. ఎవరినీ వదిలిపెట్టరు' అని దానిలో పేర్కొంది. కెన్యాతో రక్షణ ఒప్పందం చేసుకోవడానికి హైతీ ప్రధాని ఏరియల్ హెన్రీ ఇటీవల ఆ దేశ పర్యటనకు వెళ్లిన సమయంలో పోర్ట్ ఆ ప్రిన్స్‌లో నేరగాళ్ల ముఠాలు ఒక్కసారిగా రెచ్చిపోయాయి. పోలీస్ స్టేషన్లు, అంతర్జాతీయ విమానాశ్రయాలు, జైళ్లను లక్ష్యంగా చేసుకొని దాడులు మొదలుపెట్టారు.దాంతో అమెరికా విమానయాన సంస్థలు సర్వీసులను రద్దు చేశాయి. అదే సమయంలో దేశంలోనే అత్యంత తీవ్రమైన నేరగాళ్లను ఉంచే పోర్ట్ ఆ ప్రిన్స్ జైలుపై దాడులు మొదలయ్యాయి. ఈ జైల్లో దేశాధ్యక్షుడి హంతకులతోపాటు 18 మంది కొలంబియా నేరగాళ్లు కూడా ఉన్నారు.

దీని సామర్థ్యం కేవలం 3,900 కాగా.. ఇప్పుడు అందులో 11,778 మంది ఖైదీలు ఉన్నారు.ఈ క్రమంలో జైలుపై బయటి నుంచి ఓ ముఠాకు చెందిన దుండగులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బాజ్-5 ముఠా హస్తం ఉన్నట్లు భావిస్తున్నారు. మరోవైపు కెన్యాతో ఒప్పందం అమల్లోకి వస్తే.. ఆ దేశ దళాలు హైతీ రక్షణకు సాయం చేస్తాయి. దీనిపై ఓ నేరగాళ్ల ముఠా నాయకుడు జిమ్మీ చెరిజియర్ అలియాస్ బార్బెక్యూ మాట్లాడుతూ.. ప్రధాని హెన్రీని పదవి నుంచి దించుతామన్నాడు.'పోలీసులు, సైన్యమే ప్రధానిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశాడు. కాగా, జిమ్మీ గతంలో పోలీస్ అధికారిగా పనిచేశాడు. ఆ తర్వాత గ్యాంగులతో సంబంధాలు పెట్టుకొని నేరగాడిగా మారాడు. అతడిపై అమెరికా, ఐరాస ఆంక్షలు ఉన్నాయి.

# మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలపై అధ్యయనానికి కమిటీ..




**కాళేశ్వరం :** కాళేశ్వరం ప్రాజెక్టులోని కీలకమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల డిజైన్లు, నిర్మాణాల అధ్యయనానికి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కమిటీని నియమించింది. సెంట్రల్ వాటర్ కమిషన్ మాజీ చైర్మన్ జే చంద్రశేఖర్ అయ్యర్ అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేసింది. యూసీ విద్యార్థి, ఆర్ పాటిల్, శివకుమార్ శర్మ, రాహుల్ కుమార్ సింగ్ సభ్యులుగా నియమించగా.. ఎనడీఎస్ఏ డైరెక్టర్ (టెక్నికల్) అమితాబ్ మీనా ఈ కమిటీకి మెంబర్ సెక్రెటరీగా వ్యవహరించనున్నారు. కమిటీ నాలుగు నెలల్లో నివేదిక ఇవ్వాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కమిటీకి సూచించింది. మేడిగడ్డ బరాజ్‌లో మూడు పిల్లర్లు నవంబర్‌లో కుంగిన విషయం తెలిసిందే.దానిపై కాంగ్రెస్ సర్కారు ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై సమగ్రంగా విచారణ జరపాలంటూ ఫిబ్రవరి 13న నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీకి లేఖ రాసింది. మూడు బ్యారేజీల డిజైన్లతో పాటు నిర్మాణాలను నిపుణుల అధ్వర్యంలో అన్ని కోణాల్లో పరిశీలించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు స్పందించిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కమిటీని నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. బ్యారేజీలను పరిశీలించి, కుంగుబాటుకు, పగుళ్లకు కారణాలను విశ్లేషించాలని.. ఇప్పుడున్న పరిస్థితుల్లో చేపట్టాల్సిన ప్రత్యామ్నాయాలను సిఫారసు సూచించింది.

# దయామాపరుడు



విక్రమార్క చక్రవర్తి అనంతరం ఆయన కుమారుడు కీర్తికేతుడు రాజ్యానికి వచ్చాడు. తండ్రిలా కాకుండా దయాహీనుడై ప్రజలపై ఎన్నో పన్నులు విధించాడు. తన కొడుకైన విజయ భాస్కరుడు పేదలకు దానధర్మాలు చేయడం తట్టుకోలేక కొడుకుతోపాటు భార్యకు కూడా మరణశిక్ష విధించాడు కీర్తికేతుడు. అదృష్టవశాత్తూ మరణం నుంచి తప్పించుకున్న విజయభాస్కరుడు.. దొంగలు ఓ ఆడపిల్లను కాళికాదేవికి బలివ్వడానికి తీసుకురావడం చూశాడు. వెంటనే, ఆ విగ్రహాన్ని నరికేయడానికి కత్తి ఎత్తాడు. "మాతా! నువ్వు మూడులోకాలకూ పూజ్యురాలవు. అటువంటి నిన్ను నేను రక్షించడమేమిటి? నువ్వే మమ్మల్ని చల్లగా చూడాలి. ఇకనుంచి బలులు స్వీకరించనని మాటిచ్చావు. నాకంతే చాలు" అంటూ అమ్మవారికి నమస్కరించాడు విజయభాస్కరుడు. పక్కనే కట్టిపడేసి ఉన్న అమ్మాయిని తీసుకుని అక్కడినుంచి బయటికి వచ్చేశాడు. కొడుకు తీసుకువచ్చిన అమ్మాయితో అనునయంగా మాట్లాడి వివరాలు రాబట్టింది మహారాణి చారుమతీదేవి. ఆ అమ్మాయి పేరు కలభాషిణి. చంద్రగుప్త మహారాజు కూతురు. వాళ్లది చంద్రప్రస్థ నగరం అని తెలుసుకుని, ఆమెను తన తల్లిదండ్రులకు అప్పగించాలనే సంకల్పంతో.. తల్లీ కొడుకులిద్దరూ చంద్రప్రస్థానికి బయల్దేరారు. కొద్దిరోజుల ప్రయాణం తరువాత ఒకనాటి సాయంత్రం వేళకు నగరానికి కొద్దిదూరంలోని ఒక గ్రామానికి చేరుకున్నారు.

అక్కడ ఒక నిరుపేద బ్రాహ్మణుని ఇంట్లో ఆ రాత్రికి వాళ్లు ముగ్గురూ బస చేశారు. భోజనాలయ్యాక మాటలమధ్యలో ఆ బ్రాహ్మణ దంపతుల దీనగాథ విని, విజయభాస్కరుడు నిలువునా కరిగిపోయాడు. కానీ, వాళ్లకు ఎలా సాయం చేయాలో తోచలేదు.

మరునాడు వీధి అరుగుమీద కూర్చుని ఉండగా విజయభాస్కరునికి ఒక దండోరా వినిపించింది.

"అందరూ వినండహో.. పదిరోజుల కిందట కోటలో దొంగలు పడ్డారు. సొమ్ముతోపాటు యువరాణి వారిని కూడా ఎత్తుకుపోయారు. యువరాణిని తెచ్చి అప్పగించిన వారికి అర్ధరాజ్యంతోపాటుగా, ఆమెనిచ్చి పెళ్లి చేస్తామని రాజుగారు ప్రకటించారహో!"..

అది విన్న విజయభాస్కరుడు ఓ నిర్ణయానికి వచ్చి.. "చాటింపు విన్నారు కదా! ఆ అమ్మాయే యువరాణి కలభాషిణి. ఆమెను తీసుకువెళ్లి రాజుగారికి అప్పగించమని మీ అబ్బాయితో చెప్పండి. మీకు అర్ధరాజ్యం దక్కుతుంది. మీ దారిద్ర్యం తొలగిపోతుంది" అన్నాడు విజయభాస్కరుడు.. ఆ ఇంటి యజమానితో.అతడి మంచిమనసుకు తన కృతజ్ఞత ఎలా చెప్పాలో తెలియక రెండు చేతులూ జోడించాడు బ్రాహ్మణుడు. తన కుమారుడైన నిగమశర్మను పిలిచి, సంగతి సందర్భాలు వివరించి చెప్పాడు. విజయభాస్కరుడు ఇచ్చిన కత్తిని చేతబట్టుకుని, యువరాణిని తీసుకుని కోటకు వెళ్లాడు నిగమశర్మ.

మహారాజుకు యువరాణిని అప్పగించాడు. ఆయన ఆనందం పట్టలేక నిగమశర్మను కౌగిలించుకుని..

"అయ్యా! మీరెవరు? మా అమ్మాయిని మీరెక్కడ చూశారు?! దొంగలేమయ్యారు?! వాళ్లు దోచుకున్న సొమ్ములు దొరికాయా?" అని ప్రశ్నించాడు."మహారాజా! మాది ఈ పట్టణమే! ఇటీవల నేను ఉత్తరదేశ యాత్రలు చేసి, అడవి మార్గం నుంచి తిరిగి వస్తున్నాను. ఓ పదిమంది దొంగలు ఈ అమ్మాయిని ఎత్తుకుని వెళుతుంటే నా కత్తితో ఎదిరించాను. దెబ్బకు వాళ్లు పారిపోయారు" అని సమాధానం ఇచ్చాడు నిగమశర్మ.

"బ్రాహ్మణుల్లా ఉన్నారు. మీకు సాము చేయడం తెలుసా? కదురు తిప్పగలరా?!" అడిగాడు మహారాజు.

"జంధ్యాలు వడుకుతాను కనుక, కదురు తిప్పగలను. సాము గరిడీలు తెలియవు" అని అమాయకంగా చెప్పాడు నిగమశర్మ.

అతడివంక జాలిగా చూసి.. "జంధ్యాలు వడికే కదురు కాదు స్వామీ! కత్తితో కదురు తిప్పగలరా!? ఏదీ ఆ కత్తి ఓసారిలా ఇవ్వండి" అని అడిగి తీసుకున్నాడు చంద్రగుప్తుడు.

దానిపై 'విక్రమార్క చక్రవర్తి' అన్న పేరు చూసిన తరువాత, ఏదో మోసం జరుగుతున్నదనే అనుమానం అతనిలో బలపడింది. ఆలోచనలో పడ్డాడు.

ఇంతలో నిగమశర్మ కొద్దిగా హడావుడి చేస్తూ.. "మీ కుమార్తెను తెచ్చి ఇచ్చినవారికి అర్ధరాజ్యం, ఆమెనిచ్చి వివాహం జరిపిస్తామన్నారు. తొందరగా పెళ్లి ముహూర్తం పెట్టించండి" అన్నాడు దర్పంగా.

మహారాజు అతడి తీరుకు చిరాకుపడ్డాడు.

"ప్రస్తుతానికి ఈ వెయ్యి వరహాలూ పట్టుకుపో! పెళ్లి సంగతి తరువాత చూద్దాం" అని అతణ్ని పంపించి వేశాడు. కుమార్తె వద్దకు వెళ్లి..

"నిన్ను కాపాడిన వాళ్లెవరమ్మా? ఇప్పుడు వచ్చిన అబ్బాయేనా?!" అని ఆరా తీశాడు."కాదు నాన్నగారూ!" అంటూ ఆమె జరిగినదంతా పూసగుచ్చినట్లు వివరించింది.వెంటనే సైన్యాన్ని వెంటబెట్టుకుని నిగమశర్మ ఇంటికి వెళ్లాడు చంద్రగుప్తుడు. అక్కడ విజయభాస్కరుణ్ని చూస్తూనే.. 'నా కూతురు చెప్పిన వీరుడు ఇతడే అయి ఉంటాడు' అని ఊహించగలిగాడు. కానీ, నిగమశర్మ కుటుంబానికి సాయం చేయాలని తీర్మానించుకున్నందువల్ల, విజయ భాస్కరుడు తన ఉనికిని దాచిపెట్టాడు.తానో బాటసారిని మాత్రమేనని చెప్పాడు. చేసేది లేక చంద్రగుప్తుడు తిరిగి వెళ్లిపోయాడు. విజయభాస్కరుడు వెంటనే తల్లిని తీసుకుని అక్కడినుంచి నిష్క్రమించాడు.కొన్నిరోజుల ప్రయాణం తరువాత చిత్రకూటమనే అగ్రహారానికి చేరుకున్నాడు. అక్కడ ధనవంతుల ఇళ్లన్నీ విడిచిపెట్టి ఒకానొక పేదగృహాన్ని ఎంపిక చేసుకున్నాడు. గుమ్మం ముందు నిలబడి ఇంట్లో వారిని పిలిచాడు.

యజమానురాలు బయటికి వచ్చింది.

"అమ్మా! మేము పరదేశీయులం. ఈమె మా తల్లి. చాలాదూరం నడిచి రావడం వల్ల అలిసిపోయింది. ఈ పూటకు మీ ఇంట్లో ఆతిథ్యం ఇవ్వగలరా?" అని అడిగాడు విజయభాస్కరుడు.

అందుకామె.. "ఎంతమాట.. రండినాయనా!" అని ఆహ్వానించింది.

చారుమతి లోపలికి వెళ్లింది. విజయభాస్కరుడు స్నానానికి బయల్దేరుతుండగా.. ఆ ఇల్లాలు తన ఆఖరు కొడుకైన గుణసాగరుడిని తోడు పంపించింది. స్నానం చేస్తున్నంతసేపూ గుణసాగరుడు చెప్పిన మాటల్లో విజయ భాస్కరునికి కొన్ని సంగతులు తెలిశాయి.

ఒకప్పుడు విక్రమార్క మహారాజు దేశాటన చేస్తూ ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు ఒక విప్రుని ఇంట్లో బసచేశాడు. ఆయన చేసిన ఉపచారాలకు సంతోషించి, ఈ అగ్రహారాన్ని రాసిచ్చాడు. క్రమంగా అగ్రహారం పెరిగి పెద్దదైంది. ఇక్కడివారంతా మహాపండితులు, ధనవంతులయ్యారు. ఒక్క గుణసాగరుని కుటుంబమే ఆర్థికంగా వెనుకబడింది. అతనికి ఏడుగురు అన్నలున్నారు. వారంతా కొద్దోగొప్పో చదువుకున్నారు. సంపాదన కోసం దేశాటన చేస్తున్నారు. ఇతనికి మాత్రం చదువు అబ్బలేదు.. ఇంతవరకూ విషయాలన్నీ చెప్పిన తరువాత.. "అన్నా! నన్నూ మీతోపాటు రానివ్వండి. ఏదో పని చేసుకుని బతుకుతాను" అని కోరాడు గుణసాగరుడు.

ఆ మాటలు విని విజయభాస్కరునికి చాలా జాలివేసింది. కానీ, తనకే ఏ దిక్కూ లేనప్పుడు మరొకరిని ఎలా పోషించగలడు?! అందుకనే మిన్నకుండిపోయాడు. భోజనాదికాలు పూర్తయిన చాలాసేపటికి ఆ ఇంటి యజమాని దేవభట్టు వచ్చాడు. ఆయన్ని చూస్తూనే..

"ఇంత ఆలస్యం చేశారేం?!" అని అడిగింది భార్య.

అందుకు దేవభట్టు.. "ఈవేళ ఒక విశేషం చూశాను. నేను రాజవీధిలో ఒక అంగడిలో కూర్చుని ఉండగా భటులు కొందరు ఒక బంగారు విగ్రహాన్ని బండిపై పెట్టి చాటింపు వేసుకుంటూ తీసుకువెళ్లారు. ఆ వింత పూర్తిగా చూసి వచ్చేసరికి ఆలస్యం అయింది" అని ఆగాడు దేవభట్టు. "బంగారు విగ్రహాన్ని ఊరేగిస్తూ చాటింపు వేశారా.. ఏమని?!" ఆసక్తికొద్దీ అడిగింది ఇల్లాలు.


అందుకు దేవశర్మ.. "ఆ సంగతి చెప్పాలంటే నీకు మొదటినుంచి కథంతా వివరంగా చెప్పాలి" అంటూ చెప్పడం మొదలు పెట్టాడు. అక్కడికి కొద్దిదూరంలో రత్నకూటమనే నగరం ఉంది. దానిని చంద్రావలోకుడనే రాజు పాలిస్తున్నాడు. ఆయనకు అనేకమంది భార్యలున్నారు. కానీ, వాళ్లలో ఏ ఒక్కరూ ఆయన మనసును గెలుచుకోలేదు. దాంతో చింతాక్రాంతుడై ఉన్న రాజు ఒకరోజు వేటకు వెళ్లారు. అడవి పందిని వేటాడుతూ దారితప్పి తన సైన్యం నుంచి దూరంగా విడిపోయాడు. ఆ కారడవిలో ఒక సుందర తటాకం ఒడ్డున వనకన్యలాంటి ఒక సుందరీమణిని చూశాడు. ఆమె దేవలోక అప్సరస అయిన మేనక కూతురు. పేరు ఇందీవరప్రభ. ఆమెను చూడగానే చంద్రావలోకుడు ప్రేమలో పడ్డాడు. కానీ, ఆమె అభ్యంతరం చెప్పింది. తన పెంపుడు తండ్రి అయిన దేవవ్రతుని అనుమతి లేనిదే పెళ్లాడలేనని చెప్పింది. అప్పుడు చంద్రావలోకుడు ఆ సిద్ధుణ్ని వెతుక్కుంటూ వెళ్లాడు. రాజులోని వినయగుణాన్ని చూసి, సిద్ధుడు మెచ్చుకున్నాడు."రాజా! క్షత్రియులకు ఆయుధం పట్టడం ధర్మమే! కానీ వాటితో మూగజీవాలను హింసించకూడదు. ఇకనుంచి వేటాడటాన్ని విడిచిపెట్టు" అన్నాడు సిద్ధుడు.రాజు అందుకు అంగీకరించాడు. సిద్ధుడు ఏం కావాలో కోరుకోమనగా, ఇందీవర ప్రభను కోరుకున్నాడు రాజు. అలా వాళ్లిద్దరికీ పాణిగ్రహణం జరిగింది. కొత్తభార్యతో కలిసి రాజధానికి తిరిగివస్తూ చంద్రావలోకుడు అడవిమార్గంలోని ఓ మర్రిచెట్టుకింద తన తొలిరేయిని గడిపాడు. ఆ మర్రిచెట్టు జ్వాలాముఖుడనే బ్రహ్మరాక్షసుడిది. రాత్రంతా ఎక్కడెక్కడో సంచరించి, తెల్లవారబోతున్నదనగా తన నివాసానికి చేరుకున్న జ్వాలాముఖుడు.. ఆ జంటను చూసి ఆగ్రహోదగ్రుడయ్యాడు. "ఎవడురా నువ్వు? నా చెట్టుకిందికి రావడానికి దేవతలు సైతం భయపడతారు. అటువంటి చోటికి నువ్వు రావడమే కాకుండా, స్త్రీతో రమించి నా ప్రదేశాన్ని అపవిత్రం చేశావు. ఇప్పుడే నిన్ను కబళిస్తాను" అని హుంకరిస్తూ ముందుకు రాబోయాడు.చంద్రావలోకుడు గజగజ వణుకుతూ.. "మహాత్మా! నీ ఇంటికి అతిథులుగా వచ్చినవారిని నువ్వే భక్షించడం ధర్మం కాదు. నేను నీ శరణుజొచ్చుతున్నాను. నన్ను రక్షించు" అని వేడుకున్నాడు.దాంతో బ్రహ్మరాక్షసుడి మనసు కరిగింది. "సరే.. నిన్ను విడిచిపెట్టేస్తాను. కానీ, ఒక పక్షం రోజులలోపు నాకో పదహారేళ్ల బ్రాహ్మణ కుమారుణ్ని బలిగా సమర్పించాలి. అతడి కాళ్లను తల్లి, చేతులను తండ్రి పట్టుకుని ఉండగా నువ్వు నీ కత్తితో తల నరికి నాకు రక్తతర్పణం చేయాలి. చెప్పిన గడువు లోపల ఈ షరతు పూర్తి చేయలేకపోయావో ఎక్కడ దాక్కున్నా నిన్ను పట్టి నీ రక్తం పీల్చి తీరుతాను" అని హెచ్చరించాడు.చంద్రావలోకుడు బతుకుజీవుడా అనుకుంటూ రాజధానికి తిరిగి వచ్చాడు. జరిగింది మంత్రులకు చెప్పాడు. "నా ప్రాణాలకోసం వేరొకరిని బలిపెట్టడమా?! అయినా కన్నకొడుకుని చంపుతుంటే దగ్గరుండి సహకరించే కఠినాత్ములు ఎక్కడైనా ఉంటారా?!" అన్నాడు చంద్రావలోకుడు విచారంగా.అందుకు మంత్రులు బాగా ఆలోచించి అతనికో ఉపాయం చెప్పారు. దానిప్రకారం చంద్రావలోకుని ఎత్తుకు సరిపడే బంగారు విగ్రహాన్ని పోతపోయించారు. దాని చేతిలో ఒక దానపత్రాన్ని ఉంచారు.'బ్రహ్మరాక్షసునికి ఎవరైతే తమ కుమారుణ్ని బలివ్వడానికి సహకరిస్తారో, వారికి ఆ బంగారు విగ్రహం కానుకగా ఇవ్వబడుతుంది' అని అందులో రాసి ఉంచారు.అని కథంతా చెప్పిన తరువాత.. "ఈవేళ ఆ విగ్రహం మన ఊరు వచ్చింది. దాన్ని చూస్తే నాకో మంచి ఊహ తోచింది. మనింట్లో పనికిమాలిన వాడొకడున్నాడు కదా! వాణ్ని బలిచ్చి, బంగారు విగ్రహం పొందితే మన దరిద్రం అంతా వదిలిపోతుంది" అన్నాడు దేవభట్టు.

"ఎవరా పనికిమాలినవాడు?!" అని అడిగిందామె.

"ఇంకెవరూ.. గుణసాగరుడే!" అన్నాడు దేవభట్టు.

ఆ మాట వింటూనే అరుగుమీద విజయభాస్కరునితోపాటు కూర్చుని అంతసేపూ తల్లిదండ్రుల మాటలు వింటున్న గుణసాగరుని గుండెలు అదిరిపోయాయి.

## శెంబు లింగాన్ని శెంబు ఏదిరా అని అడిగితే దాచిపెట్టిన బంగారాన్ని దొంగోళ్లకు సూపెట్టిండు



ఎన్కట ఒక ఊర్లె శెంబులింగం అనే ఎడ్డోడు ఉంటుండె. ఆనికేం దెల్వది. అంత పిసపిస.. నసనస. ఊర్లె అందరికి ఆడు టైంపాస్. ఈళ్ల ఊరు అడివికి పక్కన్నే ఉంటుండె.


ఎప్పటికి దొంగల భయం ఉంటుండె. అట్లనే ఒకపారి బందిపోటోల్లు ఊరు మీద వడుతండ్లని మత్లావు దెలిశింది. ఊరోల్లంత ఆల్లతాన ఉన్న బంగారం, నగలు, నాణాలు అన్ని ముల్లెలు గట్టి సావిడి కాడున్న గడ్డివాము కింద పొక్క దవ్వి అండ్ల దాశివెట్టిండ్లు. ఓనాడు రాత్రి అనుకున్నట్టె దొంగల గుంపచ్చి ఊరుమీద వడ్డది. ఇల్లిల్లు దేవులాడిండ్లు. ఏద్దొరికితె అది ముల్లె గట్టుకున్నరు.

ఎవ్వల దగ్గర ఎండి బంగారం గనవడకుంటె.. ముచ్చట ముందే దెలిశిందేమోనని ఒక్కొక్కన్ని గొట్టుకుంట అడుగవట్టిండ్లు.

శెంబులింగం దగ్గరికి రాంగనే ఆడెట్లనో అనిపిచ్చిండు. ఆని పిసపిస సూపులు, బట్టలు జూశి జరంత గమ్మతి జేద్దామని.. "నీ పేరేంది?" అంట అడిగిండొకడు. ఎంటనే.. "శెంబులింగం" అంట గట్టిగ జెప్పిండు.. ఇనంగనే అందరు పుసుక్కున నవ్విండ్లు. ఇంకింత మజాక్ జేద్దామని ఇంకోడు.. "శెంబులింగం.. గిలాసలింగం ఏందిరా?! నువ్వు శెంబులింగమైతే మరి నీ శెంబు ఏదిరా?" అంట అడిగిండు.

పేరువెట్టి 'శెంబు.. గింబు' అనంగనే మనోనికి మస్తు రేషమచ్చింది. ఎంటనే.. "నా శెంబా..! అందరు ఆల్ల బంగారం ఏడ దాశిపెట్టిండ్లో నేను గూడ నా శెంబును ఆన్నే దాశివెట్టిన" అంట జెప్పిండు. అసలు ముచ్చట ఎరుకయ్యేటాలకు, దొంగలు గడ్డివామి కింద దాశివెట్టిన ముల్లేమూటా అంత సదుర్కవోయిండ్లు. ఊరోల్లంత నెత్తినోరు గొట్టుకుంట.. "ఓరి పిస్సోడా! నువ్వు జెయ్యవట్టే మా ముల్లెలన్ని వోయినయ్" అంట తిట్టవట్టిండ్లు. మనోడు తక్వ తిన్నడా.. "మీ ముల్లెలే వేయినట్టు ఏడుత్తాండ్లు.. నా శెంబు గూడ వోయింది" అంట లబోదిబోమన్నడు.

## బాబోయ్.. బొంబాయి టైలర్!



మా పాతింటి నుంచి ఊరి పెద్ద చెరువుకు వెళ్లే దారిలో వరమ్మ ఇల్లు ఉండేది. వరమ్మ నడివయసు దాటిన ఇల్లాలు. ఎవరి కులం ఏమిటో తెలుసుకోవాలన్న ఆసక్తీ, తెలుసుకునేనైపుణ్యమూ మాకు అప్పటికీ, ఇప్పటికీ లేవు.

అప్పట్లో ఎవరినైనా కులం పేరుతోనే గుర్తించేవారు, పిలిచేవారు. అదికూడా వాళ్ల వృత్తిని బట్టే ఉండేదనుకుంటా. ఉదాహరణకు అవుసలోళ్లు, శాలోళ్లు, చాకలోళ్లు, కుమ్మరోళ్లు, కమ్మరోళ్లు, వడ్లోళ్లు, కోమట్లు, బామండ్లు.. ఇలా బాహాటంగానే మాట్లాడుకునేవారు. మా ఇంటికి కూడా.. 'గా కర్ణాల ఇంటికి బొయ్యి కల్యమాకు అడుక్కరాపో!' అనో.. 'సల్ల పొయ్యిమను పో!' అనో తమ పిల్లల్ని పంపేవారు. ఆ విధంగానే వరమ్మను ఎప్పుడూ మేర వరమ్మ అనేవాళ్లందరూ. వరమ్మ వాళ్లింట్లో ఓ పాత కుట్టుమిషిన్ ఉండేది. దాని ముందు ఓ చెక్క స్టూల్ మీద కూర్చుని బట్టలు కుడుతూ ఉండేది. పాత తెలుపు – నలుపు సినిమాల్లో తల్లులందరూ అలా కుట్టుమిషిన్లు తొక్కి.. బట్టలు కుట్టి.. తమ కొడుకుల్ని డాక్టర్ లేదా ఐఏఎస్ చదివించడమూ, కూతుళ్ల పెళ్లి చేయడమూ చూశాను. కొన్నిసార్లయితే చెట్టంత కొడుకు వచ్చి.. 'అమ్మా! నేను బియ్యే ప్యాసయ్యానమ్మా!' అని తల్లి నోట్లో స్వీట్ పెట్టబోతుంటే ఆ తల్లి వద్దని గుక్కెడు రక్తం కక్కుకుని చనిపోవడం.. 'ఎంత పని చేశావమ్మా!' అంటూ ఆ కొడుకు నోట్లో పిడికిలి కుక్కుకుని ఏడవడం కూడా చూశాను. ఆ చివరి విషయం నాకు నచ్చకపోయినా.. కుట్టుమిషిన్ అంటే నాకు చాలా క్రేజ్, గౌరవం ఉండేవి. అంత గొప్పదైన ఆ మిషిన్ ఎప్పుడైనా ఓసారి తొక్కాలని అనుకునేదాన్ని. కానీ, ఆ అవకాశం దొరికేది కాదు. మా నానమ్మ ఏ టైలర్‌నీ మెచ్చేది కాదు. ఎవరు కుట్టినా ఆ బ్లౌజ్‌కి రిపేర్ ఉండాల్సిందే! కొన్నిసార్లు తనే మళ్లీ రిపేర్ చేసుకునేది. లేకపోతే వరమ్మకు ఇచ్చేది. అలా ఇచ్చినవి తీసుకురమ్మని మమ్మల్ని పంపేది.

అదేమిటో గానీ మేము ఎప్పుడు వరమ్మ ఇంటికి వెళ్లినా.. ఆ మిషిన్ రిపేర్‌లోనే ఉండేది. బెల్ట్ తెగిపోవడమో, బాబిన్‌లో దారం చిక్కుపడటమో లేదా మిషన్ హార్డ్‌గా తిరుగుతున్నదని నూనె వేసి ఉంచడమో.. జరిగేది.

"బిడ్డా! మీరెందుకు ఒచ్చిన్రు? నేను తీస్కొచ్చి ఇస్త తియ్యి" అనేది వరమ్మ.. ఒక కంటి అద్దంలోంచి చూస్తూ. ఆ రోజుల్లో దారిద్ర్యం ఏ స్థాయిలో ఉండేదో వరమ్మను చూస్తే తెలిసేది. ఆమె కళ్లద్దాల్లో ఒక అద్దమే బాగుండేది. ఇంకో అద్దం పగిలి గీతలు పడి ఉండేది. ఫ్రేమ్ కూడా ఒక పక్క మొత్తం విరిగిపోవడంతో, దానికి ఒక సన్నని పొడవాటి బట్టపేలిక కట్టి చెవి చుట్టూ చుట్టుకుని ఉండేది. "అయ్యో! గంత పాడయింది. ఇంకోటి కొనుక్కోక పోయినవా?!" అని మేము అడిగితే.. "పైసల్ గావొద్దామ్మా?!" అనేది. మేము నిస్సహాయులం అయ్యేవాళ్లం. వాళ్లది చాలా చిన్న ఇల్లు. గోడలకు దేవుళ్ల పటాలూ, క్యాలెండర్లూ, దూలాలకు ఫొటోఫ్రేములూ వేళ్లాడుతూ ఉండేవి. అందులో ఒక ఫొటో మమ్మల్ని చాలా భయపెట్టేది. అది వాళ్ల పెద్ద కూతురిది. పక్కూరి సంబంధమే అని పెళ్లి చేస్తే.. వాళ్లు చిత్రహింసలు పెట్టేవాళ్లట. చివరికి ఆమె ఉరేసుకుని చనిపోయిందట. విషాదం ఏమిటంటే.. అప్పటివరకూ ఆమె ఒక్క ఫొటో కూడా దిగలేదట. శవ పంచనామా సమయంలో వచ్చిన ఫొటోగ్రాఫర్‌ను బతిమిలాడి.. కొన్ని డబ్బులిచ్చి ఆమెది ఒక ఫొటో తీయించి ఫ్రేమ్ కట్టించి పెట్టుకున్నారట. మెడలో ఉరితాడుతో, బయటికి పొడుచుకు వచ్చిన నాలుకతో.. భయంకరంగా ఉండేది.

ఆమె రెండో కూతురు కూడా చాలామంచిది. కానీ పెళ్లయినా వీళ్లింట్లోనే ఉండేది. కుట్టు మిషిన్ మహత్యమో ఏమో గానీ.. తరువాతి ఇద్దరు మగపిల్లల్నీ, ఇద్దరు ఆడపిల్లల్నీ బాగానే చదివించింది వరమ్మ. ఆడ పిల్లలిద్దరూ గవర్నమెంట్ టీచర్లయ్యారు. మగవాళ్లలో పెద్దాయన బొంబాయి వెళ్లి టైలర్ అయ్యాడు. అప్పట్లో బాంబే టైలర్స్ అంటే చాలా క్రేజ్ ఉండేది. ఓసారి మా నాన్న మా పుట్టిన రోజుల గౌన్ల కోసం అప్పుడే కొత్తగా వస్తున్న మంచి ప్రింటెడ్ సింథటిక్ బట్ట తెచ్చాడు. ఆ టైంలో ఈ బాంబే టైలర్ ఎందుకో వచ్చాడు. "నేను బ్రహ్మాండంగా కుడతా!" అని మా అమ్మను కన్విన్స్ చేసి తీసుకెళ్లాడు. మాకు ప్రతిరోజూ ఆ ఫ్రాకులు వేసుకున్నట్టు కలలే! పొద్దున లేవగానే వాళ్లింటికి పరిగెత్తడం.. "ఇవాళ శనివారం, నిన్న అమాశ.. కొత్తబట్టలు కుట్టొద్దు" అంటూ కారణాలు చెప్పి, అతడు పని మొదలుపెట్టకపోవడం.. చూసి నిరాశపడటం జరిగేది. చివరికి అక్క పుట్టినరోజు రేపనగా మొత్తానికి రెండు గౌన్లు కుట్టి తెచ్చాడు. అవి చూసి మేము నీరుగారి పోయాం. అక్క బాగా సన్నం, పొడవు. తనకేమో గౌను పొట్టిగా కుట్టి నడుమూ, చేతులూ కూడా కరెక్టుగా సరిపడేంతగా ఇంక ఏమాత్రం పెంచడానికి వీల్లేనట్టు కుట్టాడు. నేను కొంచెం బొద్దు. నాకు సరిపడేలాగానే కుట్టి.. చేతులు మాత్రం ఒకటి పొడవూ, ఒకటి పొట్టీ.. ఇలా కుట్టాడు. ఒకరిది ఒకరం ఎక్స్‌చేంజ్ చేసుకోలేని పరిస్థితి. మేము గునుస్తుంటే అమ్మ.. "పోనీలే! నేను సరిజేస్త తియ్యండి" అని మమ్మల్ని ఓదార్చింది. అమ్మ జాకెట్లు అమ్మే చేతితో కుట్టుకునేది.

"ఇంతకూ బొంబాయిల నువ్ ఏం జేస్తవయ్యా?!" అని నాన్న అడిగితే.. "అక్కడ బట్టలు అందిస్త! మడుతబెడ్త. అయిన భీ రోజు జూస్త గద! మంచిగనే కుడ్త గనీ, గీడ మా అమ్మ మిషిని మంచిగలేదు" అన్నాడట. అట్లా అయ్యింది మా బొంబాయి టైలర్ పని.

# చెలరేగిన శార్దూల్-తనుష్..

## ముంబైకి భారీ ఆధిక్యం..

దేశవాళీలో అత్యంత ప్రతిష్టాత్మకమైన రంజీట్రోఫీ సెమీఫైనల్ స్టేజ్‌లో భాగంగా తమిళనాడు ముంబై మధ్య జరుగుతున్న రెండో సెమీస్‌లో ముంబై జట్టుకు తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యం దక్కింది. చివరి వరుస బ్యాటర్లు అయిన శార్దూల్ ఠాకూర్ (104 బంతుల్లో 109, 13 ఫోర్లు, 4 సిక్సర్లు) సెంచరీకి తోడు పదో నెంబర్ ఆటగాడు తనుష్ కొటియాన్ (109 బంతుల్లో 74 నాటౌట్, 10 ఫోర్లు) చెలరేగడంతో ఫస్ట్ ఇన్నింగ్స్‌లో ముంబైకి ఇప్పటికే 207 పరుగుల ఆధిక్యం దక్కింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ముంబై.. వంద ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 353 పరుగులు చేసింది. తనుష్ తో పాటు క్వార్టర్ ఫైనల్‌లో సెంచరీ చేసిన తుషార్ దేశ్‌పాండే (17 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.తమిళనాడును ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 146 పరుగులకే ఆలౌట్ చేసిన ముంబై ఆ తర్వాత బ్యాటింగ్‌లో తడబడింది. తమిళనాడు సారథి సాయి కిషోర్ ఆరు వికెట్లతో చెలరేగడంతో ముంబై 107 రన్స్‌కే 6 వికెట్లు కోల్పోయింది. ఆ దశలో క్రీజులోకి వచ్చిన శారూల్.. హార్ధిక్ తమోర్ (35), తనుష్‌ల అండతో ముంబైని పటిష్టస్థితిలో నిలిపాడు. 88 బంతుల్లోనే సెంచరీ పూర్తిచేసిన శార్దూల్.. కుల్‌దీప్ సేన్ బౌలింగ్‌లో నిష్క్రమించినా తుషార్ తమిళ బౌలర్లకు తలనొప్పిగా మారాడు. క్వార్టర్స్‌లో తుషార్‌తో పాటు తనుష్‌లు కూడా సెంచరీలతో చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే.కష్టాల్లో విదర్భ..మధ్యప్రదేశ్ విదర్భ మధ్య జరుగుతున్న తొలి సెమీస్ కూడా రసవత్తరంగా సాగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో విదర్భ 170 పరుగులకే ఆలౌట్ అవగా మధ్యప్రదేశ్.. 252 పరుగులు చేసింది. దీంతో ఆ జట్టుకు 82 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. ఈ క్రమంలో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన విదర్భ.. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 4 ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి 13 పరుగులు చేసింది. విదర్భ తొలి



ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు తీసిన మధ్యప్రదేశ్ పేసర్ అవేశ్ ఖాన్.. రెండో ఇన్నింగ్స్‌లోనూ విదర్భకు తొలి షాకిచ్చాడు. విదర్భ ఇంకా 69 పరుగులు వెనుకబడి ఉంది.

# ఐపీఎల్-17 ప్రోమో వచ్చేసింది..

## వీడియో వైరల్

మరో మూడు వారాల్లో మొదలుకాబోయే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 17వ సీజన్ హంగామా ఇప్పటికే మొదలైంది. కొద్దిరోజుల క్రితమే బీసీసీఐ.. ఐపీఎల్ -2024 తొలి విడత షెడ్యూల్‌ను విడుదల చేయగా తాజాగా ఈలీగ్ అఫిషీయల్ టెలివిజన్ పార్టనర్ స్టార్.. ప్రోమోను వదిలింది. రిషబ్ పంత్, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, హార్ధిక్ పాండ్యాలు నటించిన ఈ ప్రోమో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. 90 సెకన్ల నిడివి ఉన్న ఈ యాడ్‌తో స్టార్.. ఐపీఎల్ ప్రారంభంపై మరింత ఆసక్తిని పెంచింది.యాడ్‌లో రిషభ్ పంత్ సిక్కు వేషధారణలో కనిపించాడు. ఇటీవలే విడుదలై బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన యానియల్ సినిమా స్టైల్‌లో ఎంట్రీ ఇచ్చిన పంత్.. ఓ పంజాబీ డాబాలోకి వచ్చి గతేడాది ఐపీఎల్ ఫైనల్‌లో గుజరాత్ టైటాన్స్‌పై సిక్సర్ కొట్టి గెలిపించిన జడేజాను ధోని హత్తుకోవడం చూసి కన్నీరు కారుస్తాడు.కోల్‌కతా నైట్ రైడర్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ యాడ్‌లో ప్యూర్ బెంగాలీ అబ్బాయిగా కనిపించాడు. కండ్లకు పాతకాలం నాటి అద్దాలు పెట్టుకుని గతేడాది గుజరాత్ పై రింకూ సింగ్ ఆఖరి ఓవర్లో వరుసగా ఐదు బంతుల్లో ఐదు సిక్సర్లు కొట్టిన వీడియోను ఫ్యామిలీతో చూస్తూ ఎంజాయ్ చేసినట్టు నటించాడు.ఇక లక్నో కెప్టెన్ కేఎల్ రాహుల్.. ఓ స్టడీ హాల్‌లో చదువుకుంటున్న విద్యార్థిగా అలరించాడు. గత సీజన్‌లో లక్నో ఆర్సీబీతో ఆడిన మ్యాచ్‌లో అంపైర్ తప్పిదం వల్ల మ్యాచ్ ఓడిపోవడాన్ని చూస్తూ ఫ్రస్టేషన్‌లో బుక్ విసిరేయడం, అంపైర్‌పై అరిచినట్టు కనపించాడు.ఆఖర్లో వచ్చిన హార్ధిక్



పాండ్యా.. కంపెనీ సీఈవోగా నటించాడు. జపాన్ ప్రతినిధులతో సమావేశమైన పాండ్యా.. సమావేశం ముగియగానే టీవీలో ముంబై ఇండియన్స్ జట్టు ఐదోసారి విజేతగా నిలిచిందని చెప్పడంతోనే జపాన్ డెలిగేట్స్‌తో కలిసి సంబురాలు చేసుకుంటున్నట్టు చూపించారు. రాబోయే సీజన్‌లో హార్ధిక్.. ముంబై కెప్టెన్‌గా వ్యవహరించనున్న విషయం విదితమే.

# లార్డ్ శార్దూల్ సెంచరీ ధమాకా..

## ముంబైకి భారీ ఆధిక్యం

భారత క్రికెట్ అభిమానులు 'లార్డ్' అని పిలుచుకునే శార్దూల్ ఠాకూర్ రంజీట్రోఫీ సెమీస్‌లో అదరగొట్టాడు. రంజీ సెమీఫైనల్స్‌లో భాగంగా తమిళనాడుతో జరుగుతున్న కీలక పోరులో ముంబై తరపున ఆడుతున్న శార్దూల్.. సెంచరీతో చెలరేంగాడు. శార్దూల్ దూకుడుతో తొలి ఇన్నింగ్స్‌లో ముంబై భారీ ఆధిక్యాన్ని దక్కించుకుంది. సెమీస్‌లో ఈ సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్.. 58 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేయగా 88 బంతుల్లోనే మూడంకెల స్కోరుకు చేరుకున్నాడు. 105 బంతుల్లో 13 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో 109 పరుగులు చేశాడు. శార్దూల్‌కు ఇదే తొలి సెంచరీ కావడం గమ నార్హం.తమిళనాడుతో జరుగుతున్న సెమీస్‌లో భాగంగా తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టును 146 పరుగులకే ఆలౌట్ చేసిన ముంబై ఆ తర్వాత బ్యాటింగ్‌లో తడబడింది. 106 పరుగులకే ఆ జట్టు



ఏడు వికెట్లు కోల్పోయింది. అజింక్యా రహానే, పృథ్వీ షా, శ్రేయస్ అయ్యర్‌లు దారుణంగా విఫలమయ్యారు. యువ ఆటగాడు ముషీర్ ఖాన్ అర్ధ సెంచరీ (55)తో రాణించినా అతడు ఎక్కువసేపు నిలువలేకపోయాడు. తమిళనాడు కెప్టెన్ సాయికిషోర్ ఫైఫర్‌తో ముంబై బ్యాటింగ్ లైనప్ గజగజ వణికింది.106 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయిన దశలో క్రీజులోకి వచ్చిన శార్దూల్.. బౌండరీలు, సిక్సర్లతో తమిళనాడు బౌలర్లను బెంబేలెత్తించాడు. 88 బంతుల్లో సెంచరీ చేసిన శార్దూల్.. ఆఖరికి కుల్‌దీప్ సేన్ బౌలింగ్‌లో ఔట్ అయ్యాడు. తనుష్ కొటియాన్ అండతో శార్దూల్ ముంబై స్కోరును 300 మైలురాయిని దాటించాడు. రెండో రోజు మూడో సెషన్‌లో 88 ఓవర్ల ఆట ముగిసే సమయానికి ముంబై.. 9 వికెట్ల నష్టానికి 302 పరుగులు చేసింది. క్వార్టర్స్‌లో సెంచరీలు చేసిన పది, పదకొండో నెంబర్ బ్యాటర్లు తనూష్ కొటియాన్, తుషార్ దేశ్‌పాండేలు ప్రస్తుతం క్రీజులో ఉన్నారు. ముంబై ఆధిక్యం 156 పరుగులుగా ఉంది.

# చరిత్ర సృష్టించిన ఆస్ట్రేలియా టీనేజర్..

## వరుసగా రెండో ట్రోఫీ అతడిదే

ఆస్ట్రేలియా టీనేజర్ అలెక్స్ డి మినౌర్ మెక్సికన్ ఓపెన్ చరిత్ర సృష్టించాడు. వరుసగా రెండో ఏడాది కూడా ట్రోఫీ విజేతగా నిలిచాడు. దాంతో, 2012 తర్వాత మెక్సికన్ ఓపెన్ ట్రోఫీని నిలబెట్టుకున్న తొలి ఆటగాడిగా మినౌర్ రికార్డు నెలకొల్పాడు. మెక్సికోలోని అకాపుల్కోలో ఆదివారం జరిగిన ఫైనల్లో మూడో సీడ్ ఆటగాడైన మినౌర్ తన తడాఖా చూపించాడు. వరుస



సెట్లలో ఆధిపత్యం చెలాయించిన ఆసీస్ కుర్రాడు.. కాస్పెర్ రూడ్‌పై 6-4, 6-4తో విజయం సాధించాడు.దాంతో, మెక్సికన్ ట్రోఫీని రెండు సార్లు ముద్దాడిన నాలుగో ఆటగాడిగా మినౌర్ రికార్డుల్లోకెక్కాడు. 'అకాపుల్కో నాకు రెండో ఇల్లుతో సమానం. నిరుడు నా ప్రదర్శనతో నిరాశకు గురయ్యా. అయితే.. ఏడాది తర్వాత మళ్లీ ఇక్కడకు వచ్చి టైటిల్ నిలబెట్టుకున్నా.

## రేప్ కేసులో ఎన్‌బీఏ ఆటగాడికి రషీద్ బైర్డ్‌కు 90 ఏండ్ల జైలుశిక్ష



ప్రముఖ నటుడు, అమెరికాలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన నేషనల్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ (ఎన్‌బీఏ) లో ఆడిన మాజీ ఆటగాడు రషీద్ బైర్డ్‌కు లాస్ ఏంజెల్స్ కోర్టు షాకిచ్చింది. సెలబ్రిటీ ముసుగులో పలువురిపై అత్యా చారానికి పాల్పడ్డ కేసులలో అతడికి 90 ఏండ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. మూడున్నరేండ్లుగా పోలీసుల కస్టడీలోనే ఉన్న రషీద్‌కు తాజాగా జైలు శిక్ష ఖరారైంది.ఎన్‌బీఏలో లాస్ ఏంజెల్స్ డి-ఫెండర్స్ తరపున 2008-2009 సీజన్‌లో ఆడిన ఈ 39 ఏండ్ల మాజీ ఆటగాడు.. అదే ఏడాది విల్ ఫెరెల్ నటించిన బాస్కెట్‌బాల్ కామెడీ చిత్రం 'సెమీ ప్రో'లో నటించాడు. లాస్ ఏంజెల్స్ తర ఫున 22 మ్యాచ్‌లు ఆడిన రషీద్.. ఓ మహిళతో సెలబ్రిటీ అన్న ముసుగులో ముందు నమ్మ కస్తుడిగా నటించి తర్వాత తనను లైంగికంగా వేధించాడని, పలుమార్లు అత్యాచారానికి పాల్ప డ్డట్టు ఫిర్యాదులో పేర్కొంది.2005లో వాషింగ్టన్‌లో రషీద్ తనపై లైంగికదాడికి పాల్పడ్డట్టు బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ కేసులో అతడు 2010లో ఒకసారి అరెస్ట్ కూడా అయ్యాడు. ఆ తర్వాత 2019లో మరో మహిళను లైంగికంగా వేధించినట్టు ఫిర్యాదు రావడంతో లాస్ ఏంజెల్స్ పోలీసులు అతడిని 2020లో కస్టడీలోకి తీసుకున్నారు. సుదీ ర్ఘకాలం విచారణ జరిగిన ఈ కేసులో ఎట్టకేలకు లాస్ ఏంజెల్స్ కోర్టు ఇటీవలే విచారణను పూర్తిచేసి అతడికి 90 ఏండ్ల జీవిత ఖైదు ఖరారుచేసింది.

## గాల్లోకి ఎగిరి సిక్సర్‌ను అడ్డుకుంది..

### షాక్ తిన్న ముంబై ఓపెనర్.. వీడియో



మహిళల ప్రీమియర్ లీగ్ రెండో సీజన్‌ను విజయంతో ఆరంభించిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మళ్లీ డీలా పడింది. వరుసగా ఢిల్లీ క్యాపిటల్స్, ముంబై ఇండియన్స్ చేతిలో పరాజయం పాలైంది. శనివారం చిన్నస్వామి స్టేడియంలో ఆతిథ్య జట్టు 7 వికెట్ల తేడాతో చిత్తుగా ఓడింది. అయితే.. ఈ మ్యాచ్‌లో ఆల్‌రౌండర్ శ్రేయాంక పాటిల్ తన అద్భుత ఫీల్డింగ్‌తో ఆకట్టుకుంది.సోఫీ డెవిన్ వేసిన ఆరో ఓవర్లో ఆఖరి బంతికి ముంబై ఓపెనర్ హేలీ మాథ్యూస్ మిడాన్‌లో భారీషాట్ ఆడింది. అందరూ ఆ బంతి సిక్సర్ వెళ్లింది అనుకున్నారు. కానీ, పరుగెత్తుతూ వెళ్లిన శ్రేయాంక సిక్సర్ వెళ్లాల్సిన ఆ బంతిని ఒంటి చేత్తో అడ్డుకుంది. అయితే.. బ్యాలెన్స్ తప్పిపోయి కింద పడే సమయంలో తెలివిగా బంతిని మైదానంలో పడేసింది. దాంతో, మాథ్యూస్ నమ్మశక్యంకానట్టు షాక్‌లో ఉండిపోయింది. ప్రస్తుతం ఆ వీడియో ఆన్‌లైన్‌లో వైరల్ అవుతోంది.ఆ ఇద్దరి పోరాటంతో..టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీ జట్టు ఏ దశలోనూ భారీ స్కోర్ దిశగా సాగలేదు. మూడో ఓవర్లోనే డేంజరస్ స్మృతి మంధానా(9)ను ఇసీ వాంగ్ వెనక్కి పంపింది. ఆ తర్వాత వచ్చిన సబ్బినేని మేఘన(11), సోఫీ డెవిన్(9)లను సీవర్ బ్రంట్, ఇషాక్ వెనక్కి పంపారు. 33 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయిన ఆర్సీబీని అలీసా పెర్రీ(44), జార్జియా వరేహమ్(27)లు ఆదుకున్నారు.అనంతరం 132 పరుగుల ఛేదనలో ముంబై ఓపెనర్లు హేలీ మాథ్యూస్(26), యస్తికా భాటియా(31) బౌండరీలతో విరుచుకు పడ్డారు. ఆ తర్వాత కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్(27), అమేలియా కేర్(40 నాటౌట్)లు దంచి కొట్టారు. దాంతో, ముంబై జట్టు 7 వికెట్ల తేడాతో గెలుపొంది మూడో విజయం ఖాతాలో వేసుకుంది.

## 'జార?ండ్ క్రిస్ గేల్'కు యాక్సిడెంట్..

## ఐపీఎల్ ఆడేనా..?



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 17వ సీజన్ ముందు మాజీ చాంపియన్ గుజరాత్ టైటాన్స్‌భారీ షాక్ తగిలింది. మినీ వేలంలో రూ.3.6 కోట్లు కొల్లగొట్టిన యువ బ్యాటర్ రాబిన్ మింజ్ ఆదివారం యాక్సిడెంట్‌కు గురయ్యాడు. 'జార?ండ్ క్రిస్ గేల్', 'ధోనీ వారసుడి'గా పేరొందిన రాబిన్ నడుపుతున్న కవాసకీ సూపర్ బైక్ ప్రమాదానికి గురైంది. అయితే.. ఈ సంఘటనలోరాబిన్‌కు స్వల్ప గాయాలు అయ్యాయని, ప్రస్తుతం అతడు వైద్యుల పర్యవేక్షణలో ఉన్నాడని అతడి తండ్రి ఫ్రాన్సిస్ మింజ్ తెలిపాడు.శనివారం ట్రైనింగ్ ముగించుకొని ఇంటికి వస్తుండగా రాబిన్ బైక్ స్కిడ్ అయింది. ముందు ఒక బండి ఉండడంతో రాబిన్ తన బైక్‌ను నియంత్రించలేక కింద పడిపోయాడు. దాంతో, అతడికి చిన్నపాటి గాయాలయ్యాయి. ప్రస్తుతానికి అతడి అరోగ్యాన్ని వైద్యులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు' అని ఫ్రాన్సిస్ వెల్లడించాడు. ఐపీఎల్ సీజన్ ఆరంభానికి ఇంకా రెండు వారాల పైనే ఉంది. ఆలోపు రాబిన్ కోలుకోవాలని గుజరాత్ అభిమానులు కోరుకుంటున్నారు.

రాబిన్ తండ్రి ఫ్రాన్సిస్‌తో శుభ్‌మన్ గిల రాబిన్‌ది జార?ండ్‌లోని గుల్మా జిల్లా. అతడి ప్రతిభను గమనించిన ముంబై ఇండియన్స్ ప్రత్యే కంగా లండన్‌లో శిక్షణ ఇప్పించింది. ప్రస్తుతం రాబిన్ కుటుంబం రాంచీలో ఉంటోంది. ఆర్మీ రిటైర్డ్ ఆఫీసర్ అయిన అతడి తండ్రి ఫ్రాన్సిన్ మించ్ రాంచీ విమానాశ్రయంసెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. ఈమధ్యే గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్.. ఫ్రాన్సిస్‌ను కలిసి ఫొటో కూడా దిగాడు.నిరుడు దుబాయ్‌లో జరిగిన మినీ వేలంలో రాబిన్ ఊహించని విధంగా భారీ ధర పలి కాడు. ఈ లెఫ్ట్ హ్యాండర్‌ను గుజరాత్ రూ.3.6 కోట్లకు కొన్నది. కానీ, సరిగ్గా టోర్నీ ప్రాం ఛానికి 19 రోజుల ముందే రాబిన్ యాక్సిడెంట్‌కు గురి అయ్యాడు. మార్చి 22వ తేదీన ఐపీఎల్ 17వ సీజన్ షురూ కానుంది. గుజరాత్ తమ తొలి పోరులో భాగంగా మార్చి 24న ముంబై ఇండియన్స్‌ను ఢీ కొట్టనుంది.

## భారత క్రికెట్ జట్టుకు భారీ షాక్..

## రోహిత్ శర్మ మృతి



భారత క్రికెట్ జట్టు అభిమానులకు చేదువార్త. దేశవాళీ క్రికెట్‌లో రాజస్తాన్ తరపున ఆడిన మాజీ క్రికెటర్ రోహిత్ శర్మ మృతి చెందాడు. గత కొన్ని రోజులుగా కాలేయం సంబంధిత వ్యాధితో బాధపడుతున్న రోహిత్.. ఆదివారం తుదిశ్వాస విడిచాడు.

# ఇది సామాన్యుల కథ..

## ఎమోషనల్‌గా 'షరతులు వర్తిస్తాయి!' ట్రైలర్





కీడా కోలా ఫేమ్ టాలీవుడ్ యువ నటుడు చైతన్య రావు, భూమి శెట్టి ప్రధానపాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'షరతులు వర్తిస్తాయి'. ఈ సినిమాకు కుమార స్వామి (అక్షర) దర్శకత్వం వహిస్తుండగా.. స్టార్ లైట్ స్టూడియోస్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై శ్రీలత, నాగార్జున సామల, శ్రద్ధ, శ్రీకుమార్ గుండా తదితరులు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమా మార్చి 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో మేకర్స్ ప్రమోషన్స్ వేగం పెంచారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్‌తో పాటు 'పన్నెండు గుంజాల' సాంగ్, టీజర్ విడుదల చేయగా.. ప్రేక్షకుల వద్ద నుంచి మంచి ఆదరణ లభించింది.ఇప్పుడు తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ ట్రైలర్ విడుదల చేశారు. ఈ దేశంలో ఉన్న ఎనభై శాతం సామాన్యుల కథనే మన ఈ సినిమా అన్న డైలాగ్‌తో ట్రైలర్ మొదలవుతుంది.. కరీంనగర్ జిల్లాలో ఓ మధ్య తరగతి కుటుంబానికి చెందిన చిరంజీవి (చైతన్య రావు) తల్లి, తమ్ముడు, చెల్లి బాధ్యతలను భుజానికి ఎత్తుకొని బ్రతుకుతుంటాడు. అయితే అదే ప్రాంతానికి చెందిన విజయశాంతితో చిరంజీవికి పెళ్లి అవుతుంది. ఈ క్రమంలోనే అనుకోకుండా చిరంజీవి ఒక బిజినెస్‌లో మోసపోతాడు. అయితే చిరంజీవి మోసపోయిన బిజినెస్ ఏంటి. ఈ ప్రమాదం నుంచి చిరంజీవి ఫ్యామిలీ ఎలా బయటపడింది అనే కథాంశంతో ఈ సినిమా వస్తుంది. దిగువ మధ్యతరగతి కుటుంబ జీవితాల ఆధారంగా వచ్చి.. ఫుల్ ఎమోషనల్‌గా సాగిన ఈ ట్రైలర్ ప్రస్తుతం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది.



# ఓటీటీలోకి వస్తున్న కన్నడ సూపర్ హిట్ మూవీ

## 'బ్యాచిలర్ పార్టీ'



కన్నడ స్టార్ హీరో సప్త సాగరాలు దాటి ఫేమ్ రక్షిత్ శెట్టి సొంత ప్రొడక్షన్ సంస్థ పరమవా స్టూడియోస్ బ్యానర్ నుంచి వచ్చిన తాజా చిత్రం 'బ్యాచిలర్ పార్టీ' అభిజిత్ మహేష్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో దిగంత్, అచ్యుత్ కుమార్, యోగి, సిరి రవికుమార్ ప్రధాన పాత్రల్లో నటించారు. కామెడీ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన ఈ సినిమా జనవరి 26న ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయం అందుకుంది. ఇదిలావుంటే తాజాగా ఈ చిత్రం ఓటీటీ లాక్ చేసుకుంది.ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ సినిమా మార్చి 04 నుంచి స్ట్రీమింగ్ కానుంది. అయితే ఈ ఓటీటీ స్ట్రీమింగ్ అనేది కేవలం కన్నడ వరకే ఉంటుందా? తెలుగు డబ్బింగ్ కూడా అందుబాటులోకి తీసుకొస్తారా అనేది తెలియాల్సి ఉంది. పరమ్ వహ్ స్టూడియోస్ బ్యానర్‌పై రక్షిత్ శెట్టి, జీఎస్ గుప్తా నిర్మాతలుగా వ్యవహరించారు.

# డెలివరీ తర్వాత డిప్రెషన్‌కు గురయ్యాను : ఇలియానా






'దేవదాసు' సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది గోవా బ్యూటీ ఇలియానా. తొలి సినిమానే తెలుగులో తిరుగులేని గుర్తింపు తెచ్చిపెట్టింది. ఆ తర్వాత పోకిరి ఇండస్ట్రీ హిట్ సాధించింది. ఈ సినిమా తర్వాత ఇలియానా వెనక్కి తిరిగి చూసుకోలేదు. బ్యాక్ టు బ్యాక్ హిట్లతో అగ్ర కథా నాయ కులతో సినిమాలు చేస్తూ టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా మారిపోయింది. అయితే సినిమాల విషయం పక్కన పెడితే ఇలియానా తన ప్రియుడిని పెళ్లి చేసుకొని తల్లిగా మారిన విషయం తెలిసిందే. గత ఏడాది ఆగస్టు 1న ఈ బ్యూటీ పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. అప్పుడే 'కోవా ఫీనిక్స్ డోలన్' అంటూ పేరు కూడా పెట్టేసింది. ప్రస్తుతం తన బిడ్డ ఆలనా పాలన చూసుకుంటూ అమ్మతనాన్ని ఆస్వాదిస్తోంది.ఇదిలావుంటే తాను ప్రెగ్నన్సీ తర్వాత డిప్రెషన్‌కు గురవుతున్నట్లు ఒక పోస్ట్ పెట్టింది. డెలివరీ తర్వాత ప్రతి ఒక్కరికి డిప్రెషన్ అనేది సర్వసాధారణంగా ఉంటుంది. అయితే నేను దాని నుంచి బయటపడటానికి ప్రయత్నం చేస్తున్నానని తెలిపారు. డెలివరీ తర్వాత నిద్రలేమి సమస్యలు నన్ను వెంటాడుతున్నాయి. వాటి నుంచి బయటపడటం కోసం ప్రతి రోజు వ్యాయామం చేస్తున్నాను. కొన్నిసార్లు వ్యాయామం చేయటానికి కూడా సమయం కేటాయించలేకపోతున్నాను.

# మనీశ్ మల్హోత్రాతో కలిసి డ్యాన్స్ చేసిన జాన్వీ కపూర్, సారా అలీఖాన్



అపర కుబేరుడు ప్రముఖ పారిశ్రామిక వేత్త ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ -రాధికా మర్చంట్‌ల ప్రీ వెడ్డింగ్ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. గుజరాతలోని జామ్‌నగర్ వేదికగా జరుగుతున్న ఈ వేడుకల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి సెలబ్రిటీలు హాజరయ్యారు. అయితే ఈ వేడుకల్లో స్టార్స్ అందరూ డ్యాన్స్‌లు చేస్తూ అతిథిల్లో జోష్ నింపుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఖాన్ త్రయం (అమీర్ ఖాన్, సల్మాన్ ఖాన్, షారుఖ్ ఖాన్) నాటు నాటు పాటకు స్టెప్పులేసిన జోష్ నింపారు. అలాగే బాలీవుడ్ జంట దీపికా పదుకొణె, రణవీర్ సింగ్‌లు కూడా డ్యాన్స్ చేసి అలరించారు.ఇదిలావుంటే తాజాగా బాలీవుడ్ యువ కథానాయికలు జాన్వీ కపూర్,
ఖుషీ కపూర్, అనన్య పాండే, సారా అలీఖాన్ కలిసి డ్యాన్స్ చేశారు. షారుఖ్ ఖాన్, అమితాబ్ బచ్చన్ నటించిన ఐకానిక్ మూవీ 'కభీ ఖుషీ కభీ గమ్'లోని 'బోలె చూడియాన్ బోలే కంగనా' పాటకు ఈ నలుగురు కలిసి డ్యాన్స్ చేశారు.

# విక్రమ్ 62 క్రేజీ అప్‌డేట్.. ఇంతకీ ఆ కొత్త యాక్టర్ ఎవరో..?



కోలీవుడ్ స్టార్ హీరో ఛియాన్ విక్రమ్ కాంపౌండ్ నుంచి సినిమా వస్తుందంటే క్రేజ్ మామూలుగా ఉండదు. ఈ క్రేజీ యాక్టర్ చేతిలో వరుస సినిమాలున్నాయి. ఇప్పటికే తంగలాన్ , ధ్రువ నక్షత్రం సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. తాజాగా విక్రమ్ కొత్త ప్రాజెక్టుకు సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్ ఒకటి బయటకు వచ్చింది. విక్రమ్ నయా సినిమా 62 కీ అప్‌డేట్‌ఇవాళ సాయంత్రం 6 గంటలకు రాబోతుందని మేకర్స్ తెలియజేశారు. ఈ చిత్రంలో పాపులర్ యాక్టర్ కమ్ డైరెక్టర్ ఎస్‌జే సూర్య కీలక పాత్రలో నటిస్తున్నట్టు ఇప్పటికే అప్‌డేట్ వచ్చింది.తాజా టాక్ ప్రకారం ఈ మూవీలో మలయాళ స్టార్ యాక్టర్ ఫహద్ ఫాసిల్ జాయిన్ కాబోతున్నాడని తెలుస్తోండగా.. దీనిపై మరికొన్ని గంటల్లో క్లారిటీ రానుందట. చిన్నా ఫేం ఎస్‌యూ అరుణ్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ప్రముఖ నటీనటులు మెరువనున్నారని వార్తలు వస్తుండగా.. ఇంతకీ వారెవరెవరనేది త్వరలోనే క్లారిటీ ఇవ్వనున్నారట మేకర్స్. అడ్వెంచరస్ హిస్టారికల్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న తంగలాన్ చిత్రానికి పా రంజిత్ దర్శకత్వం వహిస్తున్నాడు. మేకర్స్ ఈ చిత్రాన్ని 2024 ఏప్రిల్ 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు.తంగలాన్ గ్లింప్స్‌తోపాటు ఫస్ట్ లుక్ పోస్టర్లు సినిమాపై క్యూరియాసిటీ అమాంతం పెంచేస్తున్నాయి. బంగారం, రక్తం, కన్నీటి చుట్టూ సాగే కథ అంటూవిక్రమ్ తన సైన్యంతో సమరాన్ని వెళ్తున్నట్టు ఉన్న కొత్త లుక్ గూస్ బంప్స్ తెప్పిస్తోంది. ఈ చిత్రంలో మాళవికా మోహనన్, పార్వతి తిరువొత్తు ఫీ మేల్ లీడ్ రోల్స్ లో నటిస్తున్నారు.. పశుపతి, డానియెల్ కల్టగిరోన్ కీ రోల్స్ పోషిస్తున్నారు.కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ (కేజీఎఫ్)లో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ మూవీని స్టూడియో గ్రీన్, నీలమ్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై కేఈ జ్ఞానవేళ్ రాజా తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీకి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. తంగలాన్ నుంచి ఇప్పటికే మాళవికా మోహనన్ లుక్ విడుదల చేయగా.. డీగ్లామరైజ్డ్‌గా కనిపిస్తూ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తోంది. ఇప్పటిదాకా గ్లామరస్ పాత్రలకే పరిమితమైన ఈ భామ తంగలాన్‌లో ఇదివరకెన్నడూ చూడని విధంగా కనిపించబోతున్నట్టు స్టన్నింగ్ లుక్‌తో క్లారిటీ ఇచ్చేశాడు డైరెక్టర్ పా రంజిత్.

# ప్రభాస్ కల్కి 2898 ఏడీ ట్రైలర్ లాంచ్ టైంపై ఆసక్తికర గాసిప్.. !





గ్లోబల్ స్టార్ హీరో ప్రభాస్ నటిస్తోన్న మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్ట్ కల్కి 2898 ఏడీ సైన్స్ ఫిక్షన్ జోనర్‌లో మహానటి ఫేం నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదల చేసిన గ్లింప్స్ వీడియో నెట్టింట వైరల్ అవుతూ.. వ్యూస్ పంట పండిస్తోంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్ అప్‌డేట్‌కు సంబంధించిన పుకారు అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తోంది. లేటెస్ట్ టాక్ ప్రకారం ఏప్రిల్ మొదటి వారంలో కల్కి 2898 ఏడీ ట్రైలర్‌ను లాంఛ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారట మేకర్స్. దీనిపై అధికారిక రావాల్సి ఉంది.ఈ చిత్రంలో దీపికా పదుకొనే, దిశా పటానీ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తుండగా.. లెజెండరీ బాలీవుడ్ యాక్టర్ అమితాబ్ బచ్చన్‌తోపాటు కమల్ హాసన్, రాజేంద్రప్రసాద్, పశుపతి ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సిల్వర్ స్క్రీన్‌పై ప్రభాస్-రాజేంద్రప్రసాద్ కాంబినేషన్ తొలిసారి కావడం విశేషం. రాజేంద్రప్రసాద్ మరి ఎలాంటి పాత్రలో కనిపించబోతున్నారన్నది ప్రస్తుతానికి సస్పెన్స్ నెలకొంది. మేకర్స్ ఇప్పటికే లాంఛ్ చేసిన టైటిల్, గ్లింప్స్ వీడియో నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది.ఇప్పటికే లాంఛ్ చేసిన కల్కి 2898 ఏడీ టీజర్ మిలియన్ల సంఖ్యలో వ్యూస్‌తో హాట్ టాపిక్‌గా మారుతోంది. ఈ చిత్రాన్ని 2024 మే 9న విడుదల చేస్తునున్నారు మేకర్స్. వైజయంతీ మూవీస్ బ్యానర్‌లో వచ్చి ట్రెండ్ సెట్టర్స్‌గా నిలిచిన జగదేకవీరుడు అతిలోక సుందరి, మహానటి సినిమాలు ఇదే రోజు రిలీజైన విషయం తెలిసిందే.మరి సేమ్ డేట్‌న రిలీజవుతుండటంతో కలెక్షన్లు ఎలా ఉండబోతున్నాయంటూ తెగ ఎక్జయిటింగ్‌గా ఎదురుచూస్తున్నారు అభిమానులు. ఇప్పటికే లాంఛ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్లు నెట్టింట వైరల్ అవుతున్నాయి. మరోవైపు కల్కి 2898 ఏడీ రైడర్స్ (యూనిఫార్మ్‌డ్ విలన్ ఆర్మీ) కాస్ట్యూమ్స్ మేకింగ్, అసెంబ్లింగ్ వీడియో సినిమాపై నెట్టింట వైరల్ అవుతున్నాయి.

Owner, Editor, Printed & Published : Gillala Buchi Reddy 12-114/1/85, Krishna Sai Nagar, Peerzadiguda, Medipally Mandal, Medchal-Malkajgiri District -500098. Telangana. Printed at S.A Printers,D-No. 3-92 Shed No 2, Sy No 45 & 49, Sadasiv Nagar, Narapally Village, Ghatkasar Mandal, Medchal-Malkajgiri District -500098, Telangana, RNI NO : TELTEL/2023/86487 Cell: 8125972476. website : quicktodaynews@gmail.com, e-mail : gbuchireddy79@gmail.com